# విశాల భారతి

20-04-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 109




## మండే ఎండలు.. ఎండుతున్న గొంతులు

- మానేరు రిజర్వాయర్ చెత్త, మట్టి దిబ్బలతో నిండిపోతోంది
- మట్టి పేరుకుపోవడంతో నిల్వ సామర్థ్యం భారీగా తగ్గుతోంది
- వ్యర్థాలు నీటిలో కలవడంతో తాగునీరు విషతుల్యమవుతోంది.
- చెత్తను కాల్చడం వల్ల స్థానికులకు శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి
- కలుషిత నీటి వల్ల జలాశయంలోని చేపలు చనిపోయే ప్రమాదం ఉంది
- వెంటనే డంపింగ్‌ను ఆపి, జలాశయాన్ని కాపాడాలంటున్న ప్రజలు

03



# నువ్వా.. నేనా.. సై!

## జగిత్యాలలో కేసీఆర్, కాటారంలో రేవంత్ రెడ్డి ఒకేరోజు సభలు

- ఏడాది తర్వాత బహిరంగ సభ ద్వారా కేసీఆర్ యాక్టివ్
- కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి
- కేసీఆర్ సభ రోజే రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు
- విమర్శలు వచ్చే టైంలోనే డబ్బులు వేసి కేసీఆర్‌కు కౌంటర్
- ఇద్దరు నేతల సభలతో తెలంగాణలో ఒక్కసారిగా పెరిగిన రాజకీయ వేడి

03




తెలంగాణ రాజకీయాల్లో ఈరోజు అత్యంత కీలకమైన అంకం ఆవిష్కృతం కాబోతోంది. ఉత్తర తెలంగాణ గుండెకాయ లాంటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా సాక్షిగా ఇద్దరు అగ్రనేతలు తలపడుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వేడి పతాక స్థాయికి చేరింది. ఒకవైపు జగిత్యాల కోటలో గులాబీ దళపతి కేసీఆర్ శంఖారావం పూరిస్తుండగా, అదే సమయంలో సరిహద్దు జిల్లా జయశంకర్ భూపాలపల్లిలోని కాటారం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యర్థులపై గర్జించేందుకు సిద్ధమయ్యారు. ఒకే రోజు పక్కపక్క జిల్లాల్లో ఇద్దరు బలమైన నేతలు బహిరంగ సభలు నిర్వహించడం వెనుక లోతైన రాజకీయ వ్యూహాలు దాగి ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రెండు సభలు కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల గమనాన్ని నిర్దేశించే దిక్సూచిలా మారుతాయనే చర్చ జరుగుతోంది.

# రాజీవ్ మెచ్చిన నాయకుడు



- 1991లో రాజీవ్ గాంధీ సభ జరిగిన వేదికపైనే నేడు కేసీఆర్ సభ
- జనసమీకరణకు ముగ్గుర్ది జీవన్ రెడ్డిని "వెల్ డన్" అని మెచ్చుకున్నారు
- 40 ఏళ్ల కాంగ్రెస్ బంధాన్ని వీడి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి
- రాజీవ్ ప్రశంసించిన గ్రౌండ్‌లోనే జీవన్ రెడ్డి రాజకీయ మలుపు
- కాంగ్రెస్‌పై పోరుకు జగిత్యాల నుంచే బీఆర్ఎస్ శంఖారావం
- నాటి సభను మించిపోయేలా భారీగా జనం వచ్చే అవకాశం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** జగిత్యాల రాజకీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఆ సన్నివేశం ఇప్పటికీ వృద్ధులైన అనేకమంది కార్యకర్తల కళ్లముందు కదలాడుతూనే ఉంటుంది. అది 1991వ సంవత్సరం మే 20వ తేదీ. భానుడి ప్రతాపానికి నిప్పులు కురిపిస్తున్న ఎండను సైతం లెక్కచేయకుండా వేలాది మంది జనం జగిత్యాల పట్టణానికి పోటెత్తారు. నాటి ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం జనసముద్రమై ఉప్పొంగింది. మాజీ ప్రధాని, నాటి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మిగతా 2లో..



# తమిళనాడులో మృత్యుఘోష

- పేలుడు ధాటికి 18 మంది కార్మికులు సజీవ దహనం
- తమిళనాడు విరుదునగర్ బాణసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు
- మరో 9 మందికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- పేలుడు ధాటికి 4 భవనాలు పూర్తిగా నేలమట్టం
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం కొనసాగుతున్న గాలింపు
- మృతుల సంఖ్య పెరిగే ఛాన్స్.. ఫ్యాక్టరీ యజమాని విచారణలో


04

## అబద్ధాలు చెప్పే రేవంత్ సీఎం అయ్యారు

- రూ. 2500 ఇస్తామని చెప్పి మహిళలను మోసం చేశారు
- తులం బంగారం, స్కూటీ ఇస్తామన్న హామీలను గాలికొదిలేశారు
- మహిళా బిల్లును అడ్డుకుని దక్షిణాదికి అన్యాయం చేశారు
- రేవంత్ పాలన కూడా కేసీఆర్ లాగే మోసపూరితం
- అబద్ధపు హామీలతో ప్రజలను నిలువునా ముంచేశారు

02





## రేవంత్ పెద్ద మోసగాడు

- రేవంత్ మొనగాడు కాదు, పెద్ద మోసగాడు అని విమర్శ
- రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి అని ప్రజలు కోరుకుంటున్నారు
- టన్నెల్ మృతుల శవాలను తీయలేని దద్దమ్మ ప్రభుత్వం అని ఫైర్
- రైతుబంధు, రుణమాఫీ ఎగ్గొట్టి అన్నదాతలను ఆగం చేశారు
- మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారు
- బీఆర్ఎస్ మళ్లీ వస్తుంది.. అన్నీ వడ్డీతో సహా చెల్లిస్తాం

02

# అమెరికా- ఇరాన్ రెండో విడత చర్చలు

- ఇస్లామాబాద్‌లో అమెరికా-ఇరాన్ ప్రతినిధుల రెండో విడత భేటీ
- ఒప్పందం కుదరకపోతే ఇరాన్ వంతెనలు, పవర్ ప్లాంట్లను లేపేస్తామని హెచ్చరిక
- హర్మూజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ కాల్పులు జరిపిందని ట్రంప్ ఆరోపణ
- మన నౌకలపై కాల్పులకి నిరసనగా ఇరాన్ రాయబారికి భారత్ సమన్లు
- హర్మూజ్ మూత వల్ల ఇరాన్‌కే రోజుకు రూ. 4,630 కోట్ల నష్టం
- బుధవారంతో కాల్పుల విరమణ గడువు ముగియనుండటంతో టెన్షన్



**విశాలభారతి, అంతర్జాతీయం:** అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ఇరు దేశాల మధ్య రెండో విడత చర్చలకు పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదిక కానుంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు మిగతా 3లో..



## మండే ఎండలు.. గాలులువర్షాలు

- పగలు భయంకరమైన ఎండలు, సాయంత్రం ఉరుములతో కూడిన వానలు
- ఉష్ణోగ్రతలు 44c దాటే ఛాన్స్.. ఏప్రిల్ 22 వరకు ఇదే పరిస్థితి
- గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- హైదరాబాద్, కరీంనగర్ సహా పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్
- మధ్యాహ్నం 12 - 4 మధ్య బయటకు వెళ్లొద్దు.. నీళ్లు ఎక్కువగా తాగండి
- పిడుగులు పడే ఛాన్స్, వర్షం పడేప్పుడు చెట్ల కింద ఉండకండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు రానున్న నాలుగు రోజుల పాటు విభిన్నమైన వాతావరణ పరిస్థితులకు సిద్ధం కావాలని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఎండల తీవ్రత ఒకవైపు ప్రాణాలు తీస్తుండగా, మరోవైపు సాయంత్రం మిగతా 3లో..

# గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- లోక్‌భవన్‌లో గవర్నర్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం
- ఆగిపోయిన అజారుద్దీన్, కోదండరామ్ ఎమ్మెల్సీ ఫైల్ల పై చర్చ
- మంత్రి అజారుద్దీన్ పదవికి ఈ నెల 30తో ఆరు నెలల గడువు పూర్తి
- ఈలోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి ఊడే అవకాశం
- ఫైలును వెంటనే క్లియర్ చేయాలని గవర్నర్‌ను కోరిన సీఎం
- ఇప్పటికే గవర్నర్‌ను కలిసి వివరణ ఇచ్చిన సీఎస్, ఏజీ

03



# అబద్ధాలు చెప్పే రేవంత్ సీఎం అయ్యారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కేవలం అసత్య వాగ్దానాలు, తప్పుడు హామీల పునాదులపైనే నిర్మితమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అడ్డదారులు తొక్కిందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా మహిళా లోకాన్ని నమ్మించి నట్టేట ముంచిన ఘనత ఈ సర్కారుకే దక్కుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేక, ప్రజల విశ్వసనీయతను కోల్పోతున్న తరుణంలోనే ఇటువంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన విశ్లేషించారు. ప్రస్తుత పాలన తీరు చూస్తుంటే గత పాలకుల అడుగుజాడల్లోనే సాగుతున్నట్లు కనిపిస్తోందని విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలోని సోదరీమణులకు ప్రతి నెలా 2500 రూపాయల నగదు అందిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు, అధికార పీఠం ఎక్కగానే ఆ విషయాన్నే విస్మరించారని బండి సంజయ్ ఆక్షేపించారు. గడచిన కాలంలో ఎంతో మంది నిరుపేద మహిళలు ఈ సాయం కోసం ఎదురుచూస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వకుండా కాలయాపన చేస్తూ, మహిళల ఆర్థిక స్వావలంబనను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ప్రతి ఇంటికీ వెళ్లి మహాలక్ష్మి పథకం గురించి గొప్పగా ప్రచారం చేసుకున్న వారు, నేడు నిధుల కొరత సాకుతో వెనకడుగు వేయడం ప్రజలను మోసం చేయడమేనని ఆయన స్పష్టం చేశారు. పెళ్లికానుక కింద తులం బంగారం అందజేస్తామంటూ నిరుపేద కుటుంబాల్లో ఆశలు రేకెత్తించిన రేవంత్ ప్రభుత్వం, ఆచరణలోకి వచ్చేసరికి ముఖం చాటేసిందని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. కూతుళ్ల పెళ్లిళ్లు చేసేందుకు అప్పులు పాలవుతున్న తల్లిదండ్రులకు భరోసా ఇస్తామని చెప్పి, చివరకు అరిచేతిలో వైకుంఠం చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోకుండా, కేవలం ప్రకటనలకే పరిమితం కావడం ఈ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. పేదల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేని పాలకులు అధికారంలో ఉండటం రాష్ట్ర ప్రగతికి ఆటంకమని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థినులకు ఉచితంగా స్కూటీలు పంపిణీ చేస్తామని చెప్పి యువతను కూడా ఈ ప్రభుత్వం నిలువునా ముంచిందని బండి సంజయ్ దుయ్యబట్టారు. ఉన్నత చదువుల కోసం వెళ్లే యువతులకు రవాణా సౌకర్యం కల్పిస్తామన్న హామీ ఎక్కడకు వెళ్లిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేక, విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు కల్పించలేక ప్రభుత్వం సతమతమవుతోందని విమర్శించారు. ఇలాంటి కల్లబొల్లి కబుర్లు చెప్పి ఓట్లు దండుకున్న నాయకులకు రాబోయే రోజుల్లో మహిళా లోకం బుద్ధి చెబుతుందని ఆయన హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో కేంద్రం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అడ్డుకోవడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించిందని కేంద్రమంత్రి ఆరోపించారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగాలని దేశమంతా కోరుకుంటుంటే, రాజకీయ స్వార్థం కోసం కాంగ్రెస్ అడ్డంకులు సృష్టించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే తమ పార్టీ అగ్రనేతల ఆదేశాలే ముఖ్యమని భావించే వారు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఈ చర్యల ద్వారా మహిళా సాధికారత పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి మరోసారి బట్టబయలైందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో పదేళ్ల పాటు సాగిన నియంతృత్వ పాలనలో కేసీఆర్ ఏ విధంగా అబద్ధాలతో ప్రజలను వంచించారో, నేడు రేవంత్‌రెడ్డి కూడా అదే బాటలో నడుస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు. ఇద్దరి పాలనలోనూ మోసమే ప్రాతిపదికగా ఉందని, పేదల బతుకుల్లో వెలుగులు నింపే దిశగా ఎటువంటి ముందడుగు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులకు, ప్రస్తుత పాలకులకు మధ్య ఎటువంటి వ్యత్యాసం లేదని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. కేవలం రంగులు మార్చి పాత పథకాలనే కొత్తగా చూపిస్తూ కాలం గడుపుతున్నారని, వాస్తవ అభివృద్ధి శూన్యమని ఆయన విశ్లేషించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేస్తూ, కేవలం అప్పుల మీద ఆధారపడి పాలన సాగించడం వల్ల భవిష్యత్తు తరాలపై భారం పెరుగుతోందని కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవంటూనే, ప్రచార ఆర్భాటాల కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వం, విపక్షాల గొంతు నొక్కడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, అణిచివేత ధోరణితో ముందుకు సాగడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి ఫలాలను రాష్ట్రంలోని ప్రజలకు అందకుండా అడ్డుకోవడమే రేవంత్ రెడ్డి లక్ష్యమని బండి సంజయ్ విమర్శించారు. అనేక రంగాల్లో తెలంగాణాకు రావాల్సిన నిధులను సక్రమంగా వినియోగించుకోవడంలో రాష్ట్ర యంత్రాంగం వైఫల్యం చెందిందని గుర్తు చేశారు. రాజకీయ విభేదాల వల్ల సామాన్య ప్రజలు నష్టపోతున్నారని, కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుపడటం వల్ల పేదలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ముఖ్యమంత్రికి పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరించడం కాంగ్రెస్ నైజమని విమర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులను సైతం జాబ్ క్యాలెండర్ పేరుతో వంచించారని, నోటిఫికేషన్ల భర్తీ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట తప్పడం, మడమ తిప్పడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని, జనం గమనిస్తున్నారనే విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాలని ఆయన హెచ్చరించారు. దక్షిణాది పట్ల వివక్ష చూపుతున్నారంటూ కేంద్రంపై తప్పుడు ఆరోపణలు చేసే రేవంత్ రెడ్డి, అసలు రాష్ట్రానికి జరుగుతున్న మేలును ఎందుకు ప్రస్తావించడం లేదని ఆయన నిలదీశారు. తెలంగాణాలో జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వే ప్రాజెక్టుల విస్తరణలో కేంద్రం చూపుతున్న చొరవను గమనించాలని సూచించారు. సొంతంగా ఆదాయ వనరులు పెంచుకోవడంలో విఫలమై, కేవలం కేంద్రంపై బురద జల్లడం ద్వారా తన అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవాలను దాచిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని మహిళా శక్తి ఈ అబద్ధాల పాలనకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని బండి సంజయ్ పిలుపునిచ్చారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండాలని, మోసపూరిత వాగ్దానాలను ఎండగట్టాలని కోరారు. ముఖ్యమంత్రి తన వైఖరిని మార్చుకుని, ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని, ఆ గడ్డపై త్వరలోనే మార్పు వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అబద్ధాల పునాదులపై ఉన్న కట్టడం కూలిపోవడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

## మహిళల బిల్లును వ్యతిరేకించడం మహిళను అగౌరపరచడమే

**మాసాయిపేట బిజెపి మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి**

**విశాలభారతి, మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో మొలుగు నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో 33% రిజర్వేషన్ వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ మరియు కాంగ్రెస్ పార్టీ మిత్ర పక్షాలను ఉద్దేశించి మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఆకాశంలో సగం ఈ భూభాగం లో సగం అని మహిళలను ఈ దేశమంతా గౌరవిస్తూ నరేంద్ర మోడీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లును ప్రవేశపెడితే కాంగ్రెస్ వారి మిత్రపక్షాలు కలిసి మహిళా రేషన్ బిల్లును అడ్డుకోవడం సిగ్గుచేటు మహిళలు రాజకీయాల్లోకి వస్తే ఈ కాంగ్రెస్ కూటమి దొంగల ఆటలు సాగవని వారిని రాజకీయాల్లోకి రాకుండా అడ్డుకోవాలని కుట్రలు చేసిన కాంగ్రెస్ కూటమి పార్టీలను ఈ దేశ మహిళలు అపరకాలిలై అధపాతాళానికి తొక్కాలని భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ కి ఒక్క సీటు కూడా రానివ్వొద్దని మాసాయిపేట మండల కేంద్రంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మాసాయిపేట మండల అధ్యక్షులు మొలుగు నాగేందర్ రెడ్డి మండల ఉపాధ్యక్షులు ఏశం నవీన్ యాదవ్, పోతన్ శెట్టిపల్లి సర్పంచ్ ఉప్పల ప్రశాంత్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు కేతవత్ లింగం నాయక్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నగేష్, శక్తి కేంద్రం ఇంచార్జ్ కేతావత్ రాములు నాయక్, భూత్ అధ్యక్షులు గౌరగల రాములు, పల్లపు సురేష్, కుక్క దువు రవి, సీనియర్ నాయకులు తరుణ్ కృష్ణ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఓబిసి మాసాయిపేట అధ్యక్షులు నాసన్ పల్లి వదనల నాగేష్ పెళ్లిరోజు సందర్భంగా బిజెపి నాయకులందరూ కలిసి శాలువాతో సన్మానం చేశారు.

## శాట్ డిప్యూటీ డైరెక్టర్‌గా అశోక్ కుమార్ క్రీడా సంఘాల ఘన సన్మానం



**విశాలభారతి, శంకరపట్నం :** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) డిప్యూటీ డైరెక్టర్‌గా అతి పిన్న వయసులోనే పదోన్నతి పొందిన గుగులోతు అశోక్ కుమార్‌ను పలు క్రీడా సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. గతంలో జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారిగా సమర్థవంతంగా సేవలు అందించిన ఆయనకు, ఇటీవల ప్రభుత్వం డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. ఆదివారం తాడికల్ గ్రామానికి విచ్చేసిన అశోక్ కుమార్‌ను తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొరిమి సంతోష్, బాధ్యులు బుద్ధార్థి సంపత్,లు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అశోక్ కుమార్ తన కృషి, పట్టుదల, అంకితభావంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారని కొనియాడారు. యువ వయసులోనే ఈ స్థాయికి చేరుకోవడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. క్రీడాభివృద్ధి ఆయన నాయకత్వంలో తెలంగాణ క్రీడారంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీత అశోక్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. యువత తమ లక్ష్యాల పట్ల స్పష్టతతో, కష్టపడి పని చేస్తే అనుకున్నది సాధించవచ్చని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

# రేవంత్ పెద్ద మోసగాడు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పాలనపై భారత రాష్ట్ర సమితి శాసనసభ పక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నాగార్జునసాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని సుదీర్ఘంగా ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు స్వరూపాన్ని ప్రజలు అతి తక్కువ కాలంలోనే గుర్తించారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు తనను తాను మొనగాడిగా అభివర్ణించుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలోనే ఒక పెద్ద మోసగాడిగా ముద్ర వేయించుకున్నారని విమర్శించారు. తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజలు ఇప్పుడు ఒకే ఆకాంక్షతో ఉన్నారని, ప్రస్తుత ముఖ్యమంత్రి వెళ్లాలని, కేసీఆర్ మళ్లీ పాలనా పగ్గాలు చేపట్టాలని ఆశిస్తున్నారని ఆయన ఉద్ఘాటించారు. కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం మళ్లీ కొలువుదీరే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నాయని జోస్యం చెప్పారు. రాష్ట్రంలోని రైతాంగం ఎదుర్కొంటున్న కష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు హరీశ్‌రావు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న అగచాట్లు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్ల బీట్లను సందర్శించిన సమయంలో దశరథ్ రెడ్డి వంటి సామాన్య రైతులు పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోయానని పేర్కొన్నారు. మిల్లుల వద్ద తరుగు పేరుతో క్వింటాల్‌కు ఏడు కిలోల వరకు కోత విధిస్తుండటం దారుణమని మండిపడ్డారు. అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనే దిక్కు లేదని, కొనుగోలు చేసినా తరుగు పేరుతో దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఇంతలా ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి మాత్రం ఢిల్లీ పర్యటనలకే పరిమితమయ్యారని విమర్శించారు. గాలి మోటార్లలో విహరిస్తూ భూమ్మీద ఉన్న సామాన్యుల సమస్యలను రేవంత్ రెడ్డి పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం కూలిపోయిన ఘటనపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఎనిమిది మంది ప్రాణాలు బలిగొన్న ఆ ప్రమాదం జరిగినప్పుడు మంత్రులు పర్యాటక ప్రాంతానికి వెళ్లినట్లు గాలి మోటార్లలో వెళ్లారని విమర్శించారు. సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటికీ మృతుల శవాలను బయటకు తీయలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ పాలనలో పదకొండున్నర కిలోమీటర్ల మేర సొరంగ పనులను పూర్తి చేశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కమిషన్ల కోసం కక్కుర్తి పడటం వల్లే ఈ ప్రాజెక్టు కుప్పకూలిపోయిందని ఆరోపించారు. ఎనిమిది మంది కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చిన ఈ ఘటనకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, శవాలను కూడా వెలికితీయలేని దద్దమ్మ పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు దుయ్యబట్టారు. వరంగల్ వేదికగా రాహుల్ గాంధీ సమక్షంలో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లోని అంశాలను కాలగర్భంలో కలిపేశారని విమర్శించారు. పంటల బీమా, బోనస్, రైతు భరోసా వంటి వాగ్దానాలన్నీ గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి పంపే సంచుల కోసం రాహుల్ గాంధీ సైతం మౌనంగా ఉండిపోతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా భావిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ ఎందుకు మొట్టికాయలు వేయడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోని పక్షంలో ప్రజలు హస్తం పార్టీని క్షమించరని ఆయన హెచ్చరించారు. రుణమాఫీ వ్యవహారంలో రేవంత్ రెడ్డి రైతులను దారుణంగా వంచించారని హరీశ్‌రావు ఆరోపించారు. మొదటి సంతకం రుణమాఫీ పైనే చేస్తామని చెప్పి, పంద్రాగస్టు నాటికి పూర్తి చేస్తానని 101 దేవుళ్ల మీద ఒట్టు వేసి మాట తప్పారని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో రెండు లక్షల లోపు రుణం ఉన్న రైతులకు కూడా ఇప్పటికీ మాఫీ కాలేదని గణాంకాలతో వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం నలభై శాతం మందికి మాత్రమే లబ్ధి చేకూర్చి, అరవై శాతం మందిని ఎగబెట్టారని నిలదీశారు. అసెంబ్లీలో ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక రావాల్సిన నాలుగు రైతుబంధు వాయిదాల్లో కేవలం ఒక్కటి మాత్రమే ఇచ్చి, మిగిలిన ఇరవై వేల కోట్లు ఎగ్గొట్టారని గణాంకాలను బయటపెట్టారు. వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న ఉదాసీనతను హరీశ్‌రావు ఎండగట్టారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్నరకాలకే పరిమితం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని అన్నారు. బోనస్ హామీ బోగస్ అయిపోయిందని, పంటల బీమా ఊసే లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేసి, సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని గుర్తు చేశారు. నాగార్జున సాగర్ లో లెవల్ కెనాల్ పూర్తి చేసి యాభై వేల ఎకరాలకు నీరందించిన ఘనత తమదేనని చెప్పారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించి అన్నదాతకు అండగా నిలిచామని పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులు మాత్రం కేవలం కమిషన్ల కోసం ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని హరీశ్‌రావు హెచ్చరించారు. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పైసాను వడ్డీతో సహా కక్కిస్తామని స్పష్టం చేశారు. నాయకులు ధైర్యంగా ఉండాలని, తమపై అక్రమ కేసులు పెట్టినా భయపడాల్సిన అవసరం లేదని పిలుపునిచ్చారు. మళ్లీ వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఆ విషయాన్ని కాంగ్రెస్ శ్రేణులు కూడా గ్రహించాయని పేర్కొన్నారు. అందుకే అధికార పార్టీ నేతలు ఇప్పుడు తమ పాత పద్ధతులను మార్చుకోకుండా కేవలం సంపాదనపైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్న వారిని చట్టం ముందు నిలబెట్టి తీరుతామని ఆయన గంభీరంగా హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్లు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కుమ్మక్కయ్యారని హరీశ్‌రావు సంచలన ఆరోపణ చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులపై ఒత్తిడి తెచ్చి రైతులకు మద్దతు ధర దక్కకుండా చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి తరుగు లేకుండా పంటను సేకరించాలని డిమాండ్ చేశారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైతే తాము ఊరుకోబోమని చెప్పారు. రైతాంగం పక్షాన భారత రాష్ట్ర సమితి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ తీరు వల్ల నిరాశలో ఉన్న అన్నదాతలకు భరోసా కల్పించే బాధ్యతను తమ పార్టీ తీసుకుంటుందని ఆయన వివరించారు. జగిత్యాల నుంచి నాగార్జున సాగర్ వరకు ఎక్కడికి వెళ్లినా ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు ఇప్పుడు ఆగిపోవడం వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. ప్రజల అవసరాల కంటే తమ కుర్చీలను కాపాడుకోవడమే పాలకులకు ముఖ్యమైపోయిందని దుయ్యబట్టారు. ఈ అరాచక పాలన నుంచి విముక్తి లభించే రోజులు త్వరలోనే వస్తాయని, అప్పటి వరకు కేడర్ ప్రజల పక్షాన పోరాడాలని ఆయన ఉత్సాహపరిచారు. నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. అధికార పార్టీ ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని కోరారు. రాబోయే కాలంలో పార్టీకి మంచి రోజులు ఉన్నాయని, ప్రతి గ్రామంలోనూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. రైతుల కళ్లలో వస్తున్న కన్నీరు ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతుందని శాపనార్థాలు పెట్టారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఎంత ప్రయత్నించినా, ప్రజలు ప్రతిదీ గమనిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కార్యకర్తలే పార్టీకి బలమని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం భవిష్యత్తులో ఉంటుందని హామీ ఇచ్చారు.

# రాజీవ్ మెచ్చిన నాయకుడు

**మొదటిపేజీ తరువాయి**

రాజీవ్ గాంధీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అక్కడికి వచ్చారు. సాయంత్రం వేళ సభా వేదికపైకి రాజీవ్ రాగానే మైదానంతో పాటు పరిసర రహదారులు సైతం జనంతో కిక్కిరిసిపోయి కనిపించాయి. ఆ అద్భుత ప్రజా స్పందనను చూసి రాజీవ్ ముగ్ధులయ్యారు. తన రాజకీయ ప్రస్థానంలో అంతటి భారీ బహిరంగ సభను తాజా కాలంలో చూడలేదని మురిసిపోయారు. సభకు అధ్యక్షత వహిస్తున్న యువ నాయకుడు టీ జీవన్ రెడ్డిని ప్రత్యేకంగా పిలిచి భుజం తట్టి అభినందించారు. నాటి సభలో రాజీవ్ గాంధీ నోట వచ్చిన ఆ ప్రశంసలు జీవన్ రెడ్డి రాజకీయ జీవితంలో ఒక కలికితురాయిలా నిలిచిపోయాయి. అధినేత మెచ్చిన నాయకుడిగా ఆయన ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదిగారు. కాంగ్రెస్ అంటే జీవన్ రెడ్డి, జీవన్ రెడ్డి అంటే కాంగ్రెస్ అన్నట్లుగా జగిత్యాల గడ్డపై నాలుగు దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యం వహించారు. హస్తం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, అధికారంలో ఉన్నప్పుడు కూడా ఆయన జెండా నీడనే ఉంటూ విశ్వసనీయతకు నిలువెత్తు రూపంగా నిలిచారు. క్లిష్ట సమయాల్లో పార్టీని ఆదుకుంటూ జాతీయ నాయకత్వం దృష్టిలో నిలకడైన నేతగా గుర్తింపు పొందారు. జగిత్యాల నియోజకవర్గంలో ఆయన వేసిన ప్రతి అడుగు ఒక రాజకీయ పాఠంగా, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే మార్గంగా కొనసాగింది. దశాబ్దాల పాటు సాగిన ఆ అనుబంధం ఇప్పుడు అనివార్య కారణాలతో ఒక ముగింపునకు చేరుకుంది. కాలచక్రం గిర్రున తిరుగుతూ మళ్లీ అదే వేదికను మరో చారిత్రక ఘట్టానికి సిద్ధం చేస్తోంది. ముప్పై ఐదు ఏళ్ల క్రితం ఏ మైదానంలోనైతే రాజీవ్ గాంధీ ప్రశంసలు పొందారో, ఇప్పుడు అదే ప్రాంగణంలో జీవన్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో సరికొత్త మలుపు తీసుకోబోతున్నారు. ఎస్‌కేఎన్‌ఆర్ జూనియర్ కళాశాల మైదానం నేడు వివేకానంద స్టేడియంగా రూపుమార్చుకుంది. ఇదే ప్రాంగణం వేదికగా తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుండి నేటి వరకు స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తున్న కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. ఒక సీనియర్ నేత పార్టీ మారుతున్న తరుణంలో జగిత్యాల ప్రాంతం అంతా ఉత్కంఠతో ఊగిపోతోంది. దశాబ్దాల పాటు కాంగ్రెస్ సిద్ధాంతాల కోసం పోరాడిన యోధుడు ఇప్పుడు తన దారి మార్చుకుని తెలంగాణ స్వయం సిద్ధాంతం వైపు అడుగులు వేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. జగిత్యాల జైత్రయాత్ర పేరిట నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభ కాంగ్రెస్ పాలనపై దండయాత్రగా మారబోతోంది. అధికార పార్టీ వైఖరిని నిరసిస్తూ, ఆత్మగౌరవ పోరాటమే ఎజెండాగా జీవన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన అనుచర వర్గం గట్టిగా వినిపిస్తోంది. రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యత ఇచ్చే నేతగా పేరున్న ఆయన, ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో ఇమడలేకపోయారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయిలో చోటుచేసుకున్న పరిణామాలు, ప్రత్యర్థులను పార్టీలోకి ఆహ్వానించడం వంటి చర్యలు ఆయనను తీవ్రంగా కలచివేశాయి. తన ఉనికిని చాటుకోవడానికే కాకుండా, జగిత్యాల ఆత్మగౌరవాన్ని కాపాడడానికే ఈ సమర శంఖారావం పూరించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రజా ఆశీర్వాద సభ ద్వారా తమ బలాన్ని నిరూపించుకోవాలని బీఆర్‌ఎస్ శ్రేణులు వ్యూహరచన చేస్తున్నాయి. రేపటి సభకు తరలివచ్చే జనం సంఖ్య 1991 నాటి రాజీవ్ గాంధీ సభను మించిపోవాలని గులాబీ దళం పట్టుదలతో ఉంది. జగిత్యాల పట్టణ వీధులన్నీ గులాబీ తోరణాలతో, భారీ కటౌట్లతో నిండిపోయాయి. లక్షలాది మంది జనం ఈ సభకు సాక్ష్యంగా నిలవబోతున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు గులాబీ జెండా రెపరెపలాడబోతోంది. కేసీఆర్ స్వయంగా వచ్చి జీవన్ రెడ్డిని ఆహ్వానిస్తుండటంతో ఈ వేడుకకు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. రవాణా ఏర్పాట్లు, తాగునీరు, వేదిక అలంకరణ వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యాయి. జనసమీకరణలో జీవన్ రెడ్డికి ఉన్న పట్టును ఈ సభ ద్వారా మరోసారి చాటిచెప్పాలని ఆయన వర్గీయులు భావిస్తున్నారు. ఈ సభ కేవలం ఒక నాయకుడి చేరికకు పరిమితం కాకుండా, కాంగ్రెస్ సర్కార్ పై యుద్ధ ప్రకటనలా ఉండబోతోంది. ప్రస్తుత పాలనలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తిచూపుతూ కేసీఆర్ గర్జించనున్నారు. రైతుల సమస్యలు, రుణమాఫీ అమలులో లోపాలు, సంక్షేమ పథకాల నిలిపివేత వంటి అంశాలపై జనాన్ని చైతన్యపరచడమే లక్ష్యంగా ప్రసంగాలు సాగనున్నాయి. జగిత్యాల వేదికగా మొదలయ్యే ఈ నిరసన జ్వాల రాష్ట్రవ్యాప్తంగా వ్యాపిస్తుందని బీఆర్‌ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నేత తోడవ్వడంతో ఉత్తర తెలంగాణలో పార్టీకి కొత్త ఊపిరి పోసినట్లవుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జీవన్ రెడ్డి వ్యక్తిగత చరిష్మా, కేసీఆర్ రాజకీయ చతురత కలగలిసి వివేకానంద స్టేడియంలో సరికొత్త ప్రకంపనలు సృష్టించబోతున్నాయి. రాజకీయాల్లో ఎవరూ శాశ్వత మిత్రులు కాదని, శాశ్వత శత్రువులు ఉండరని జీవన్ రెడ్డి నిర్ణయం నిరూపిస్తోంది. దశాబ్దాల పాటు కేసీఆర్‌తో విభేదించినా, పరస్పర గౌరవం ఎప్పుడూ తగ్గలేదు. తెలంగాణ ఉద్యమ కాలంలోనూ, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లోనూ వీరిద్దరి మధ్య గౌరవప్రదమైన దూరం ఉండేది. ఇప్పుడు అదే గౌరవం ఒకే వేదికపైకి వారిని తీసుకువచ్చింది. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఈ అడుగులు వేస్తున్నట్లు జీవన్ రెడ్డి ప్రకటించారు. తన అనుచరుల భవిష్యత్తు కోసం, పార్టీలో తనకు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ ఆయన తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయంపై జనంలో మిశ్రమ స్పందన ఉన్నప్పటికీ, ఆయన పట్ల ఉన్న వ్యక్తిగత అభిమానం మాత్రం చెక్కుచెదరలేదు. అదే అభిమానం రేపటి సభలో జనప్రవాహంగా మారనుంది. వివేకానంద స్టేడియం చుట్టూ ఉన్న రహదారులు రేపు చీమలదండులా జనంతో నిండిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. పోలీసులు భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేశారు. సభా ప్రాంగణంలోకి ఎవరికీ ఇబ్బంది కలగకుండా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. స్టేడియం లోపలికి రాలేని వారి కోసం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో భారీ ఎల్ ఈడీ తెరలు సిద్ధం చేశారు. కేసీఆర్ రాక కోసం జగిత్యాల గడ్డ ఎదురుచూస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ నాయకులందరూ ఈ సభలో పాల్గొనబోతున్నారు. జగిత్యాల నియోజకవర్గ రాజకీయ చిత్రపటం ఈ సభ తర్వాత పూర్తిగా మారిపోనుంది. ఒకప్పుడు కాంగ్రెస్‌కు పెట్టని కోటగా ఉన్న ఈ గడ్డ ఇప్పుడు గులాబీ పార్టీకి ప్రధాన కేంద్రంగా మారబోతోంది. ఈ మార్పు తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి. జీవన్ రెడ్డి ప్రస్థానంలో రాజీవ్ గాంధీ భుజం తట్టిన వేదిక ఎంతటి తీపి జ్ఞాపకమో, ఇప్పుడు కేసీఆర్ కండువా కప్పే వేదిక అంతటి చారిత్రక అవసరంగా కనిపిస్తోంది. జీవితాంతం హస్తం పార్టీని నమ్ముకున్న వ్యక్తికి సొంత పార్టీలోనే వేధింపులు ఎదురవ్వడం రాజకీయాల క్రూరత్వానికి నిదర్శనం. ఆత్మాభిమానం దెబ్బతిన్న చోట మౌనంగా ఉండటం కంటే పోరాడటమే మేలని ఆయన భావించారు. అందుకే తన వయస్సును, సుదీర్ఘ అనుభవాన్ని పక్కనపెట్టి కొత్త పోరాటానికి సిద్ధమయ్యారు. ఈ పోరాటంలో కేసీఆర్ అండగా నిలవడం ఆయనకు కొండంత బలాన్నిస్తోంది. జగిత్యాల వేదికగా జరిగే ఈ సభ ద్వారా తన సత్తా ఏంటో మరోసారి నిరూపించడానికి ఆయన సిద్ధమయ్యారు. జనం ఇచ్చే తీర్పు తన నిర్ణయానికి సరైన సమాధానమని ఆయన నమ్ముతున్నారు. ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం చేయడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో జగిత్యాల గళాన్ని వినిపించాలని బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉవ్విళ్లూరుతున్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటా ఈ సభ గురించే చర్చ జరుగుతోంది. కేవలం రాజకీయాలకే కాకుండా, ఒక సీనియర్ నేతకు జరుగుతున్న వీడ్కోలు, అదే సమయంలో కొత్త ప్రయాణానికి స్వాగతం పలుకుతున్న వేడుకగా దీనిని ప్రజలు భావిస్తున్నారు. జగిత్యాల పురవీధుల్లో జరిగే ఈ జైత్రయాత్ర రాబోయే ఎన్నికలకు దిక్సూచిగా మారనుంది. కాంగ్రెస్ బలహీనతలే తమకు బలమని భావిస్తున్న ప్రతిపక్షం, ఈ సభ ద్వారా తమ ఉనికిని చాటుకోవాలని చూస్తోంది. వివేకానంద స్టేడియం ఇప్పుడు ఒక రాజకీయ ప్రయోగశాలగా మారి, భవిష్యత్తు తెలంగాణ రాజకీయాలను నిర్ణయించబోతోంది.



# నువ్వా.. నేనా.. సై!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

గులాబీ దళపతి కేసీఆర్ సుమారు ఏడాది కాలంగా ప్రజలకు, బహిరంగ సభలకు దూరంగా ఉంటూ క్షేత్రస్థాయి రాజకీయాలపై మౌనం వహించారు. ఇప్పుడు జగిత్యాల వేదికగా ఆయన మళ్లీ ప్రజల ముందుకు వస్తుండటం బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది. శాసనసభ ఎన్నికల పరాజయం తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభను పార్టీ పునర్వైభవం కోసం ఒక 'రీ లాంచ్' ప్లాట్‌ఫామ్‌గా కేసీఆర్ భావిస్తున్నారు. పాలనలో అనుభవం లేని కాంగ్రెస్ వల్ల రాష్ట్రం ఏ విధంగా నష్టపోతోందో వివరించడం ద్వారా ప్రజల మద్దతును తిరిగి కూడగట్టాలనేది ఆయన ప్రధాన లక్ష్యం. పార్టీ కేడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని పారద్రోలి, మున్ముందు చేపట్టబోయే పోరాటాలకు ఇక్కడి నుంచే నాంది పలకాలని గులాబీ నాయకత్వం యోచిస్తోంది. ఈ సభా వేదికపైనే కాంగ్రెస్ సీనియర్ నేత, దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న టీ. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనుండటం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రాధాన్యత తగ్గడం, స్థానిక సమీకరణాల నేపథ్యంలో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం జగిత్యాల రాజకీయాలను మలుపు తిప్పబోతోంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతను తమ వైపు తిప్పుకోవడం ద్వారా కాంగ్రెస్ కోటలో బీఆర్ఎస్ పెద్ద రంధ్రమే వేసినట్లయింది. ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ బలహీనపడుతోందన్న సంకేతాలను ప్రజల్లోకి పంపడానికి కేసీఆర్ ఈ చేరికను ప్రధాన అస్త్రంగా వాడుకోనున్నారు. ఒక సీనియర్ నాయకుడి నిష్క్రమణ ద్వారా కాంగ్రెస్ అంతర్గత విభేదాలను ఎండగట్టాలని ఆయన ప్రణాళికలు రచిస్తున్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కేసీఆర్ వ్యూహాలకు అంతే ధీటుగా స్పందిస్తున్నారు. విపక్ష నేత జగిత్యాలలో గర్జిస్తున్న తరుణంలోనే, కాటారం వేదికగా రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేయడం ద్వారా కేసీఆర్ ప్రసంగంలోని తీవ్రతను తగ్గించాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. గత కొన్ని రోజులుగా నిధుల కొరత సాకులు చెప్పిన యంత్రాంగం, సరిగ్గా సోమవారం నాడే రైతు భరోసా రెండో విడత నిధులు విడుదల



చేయడానికి కసరత్తు పూర్తి చేసింది. సుమారు 45 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 2,063 కోట్లను ఒకే బటన్ నొక్కి జమ చేయడం ద్వారా తమది 'రైతు పక్షపాత ప్రభుత్వం' అని చాటిచెప్పడం రేవంత్ రెడ్డి ఉద్దేశ్యం. కేసీఆర్ విమర్శలు చేసే సమయానికి రైతుల మొబైల్ ఫోన్లలో మెసేజ్‌లు మోగేలా ప్రభుత్వం సమయం నిర్ణయించింది. కాటారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేవలం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, కేసీఆర్ పదేళ్ల పాలనపై నిప్పులు చెరిగే అవకాశం ఉంది. గత ప్రభుత్వం చేసిన అప్పులు, నీటిపారుదల ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిని సాక్ష్యాలతో సహా ప్రజల ముందుంచాలని రేవంత్ సిద్ధమయ్యారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, పంప్ హౌస్‌ల మునక వంటి అంశాలను ప్రస్తావించడం ద్వారా ప్రజల్లో ఉన్న అసంతృప్తిని కేసీఆర్ వైపు మళ్లించాలని చూస్తున్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామనే భరోసా ఇవ్వడం ద్వారా, బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలని రేవంత్ వ్యూహం పన్నారు. ప్రజల దృష్టిని పథకాల వైపు మళ్లించడం ద్వారా విపక్ష సభ ప్రభావాన్ని తగ్గించడం ఇందులో భాగం. ఉత్తర తెలంగాణలోని రాజకీయ ప్రాబల్యంపై పట్టు సాధించేందుకు ఈ రెండు సభలు ఉత్ప్రేరకాలుగా పనిచేయనున్నాయి. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు ఎప్పుడూ రాజకీయ చైతన్యానికి మారుపేరుగా నిలిచాయి. కేసీఆర్ తన సభ ద్వారా ఇక్కడి పాత పట్టును తిరిగి పొందాలని చూస్తుంటే, రేవంత్ రెడ్డి మాత్రం సంక్షేమ పథకాల ద్వారా ఆ పట్టును సడలించాలని ప్రయత్నిస్తున్నారు. కవిత ఏర్పాటు చేసిన కొత్త పార్టీ వల్ల గులాబీ శ్రేణుల్లో కొంత గందరగోళం నెలకొన్న నేపథ్యంలో, కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి కేడర్‌కు దిశా నిర్దేశం చేయనున్నారు. అగ్రనేతల మధ్య సాగుతున్న ఈ పైచేయి రాజకీయం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల మీద కూడా తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇరుపక్షాల మధ్య వాడివేడి చర్చ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పుల ఊబిలో రాష్ట్రాన్ని నెట్టారని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే, అభివృద్ధిని కుంటుపరిచారని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. కేసీఆర్ తన ప్రసంగంలో రాష్ట్ర ఆదాయ వనరులు, సంపద సృష్టిపై గణాంకాలతో కాంగ్రెస్ వైఫల్యాలను నిలదీయనున్నారు. రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిధుల మళ్లింపును ఎండగట్టబోతున్నారు. ఇద్దరు నేతలు గణాంకాల యుద్ధానికి తెరలేపుతుండటంతో సామాన్య ప్రజల్లో ఎవరి వాదన సరైనదనే ఉత్కంఠ నెలకొంది. పారదర్శకత, జవాబుదారీతనం విషయంలో ప్రజల తీర్పు ఎలా ఉంటుందో ఈ సభల తర్వాత కొంత స్పష్టత రావచ్చు. కేసీఆర్ సుదీర్ఘ మౌనం తర్వాత సభ నిర్వహిస్తుండటంతో జగిత్యాలకు వచ్చే జనసమీకరణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రజలు ఇప్పటికీ కేసీఆర్ మాటలను వినేందుకు ఆసక్తి చూపుతున్నారా లేదా అనేది ఈ సభ ద్వారా వెల్లడి కానుంది. ఒకవేళ కేసీఆర్ సభ ఘనవిజయం సాధిస్తే, బీఆర్ఎస్ మళ్లీ పుంజుకుందనే చర్చ మొదలవుతుంది. కాటారం సభలో రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చే భరోసా ఎంత వరకు ఫలిస్తుందో చూడాలి. కేసీఆర్ సభను డైవర్ట్ చేసేందుకు రైతు భరోసా నిధులు విడుదల చేయడం రేవంత్ రాజకీయ చతురతకు నిదర్శనం. సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు సాగే ఈ రెండు సభల ప్రభావం సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున ప్రతిధ్వనించనుంది. సమాఖ్య స్ఫూర్తి, రాష్ట్ర హక్కుల విషయంలో కూడా కేసీఆర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన వాటాల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోందని ఆయన విమర్శించవచ్చు. రేవంత్ రెడ్డి మాత్రం కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో తాము విఫలం కాలేదని, గత ప్రభుత్వం చేసిన తప్పులే అడ్డంకిగా మారాయని చెప్పుకొచ్చే అవకాశం ఉంది. పాలనాపరమైన అంశాల కంటే రాజకీయ విమర్శలే ఈ సభల్లో ఎక్కువగా వినిపించే ఛాన్స్ ఉంది. ప్రజల సమస్యల కంటే కూడా పరస్పర ఆరోపణలకే అగ్రనేతలు ప్రాధాన్యత ఇస్తుండటంపై కొందరు విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. నిజానికి ఒకే రోజు ఈ రెండు కార్యక్రమాలు జరగడం యాదృచ్ఛికం కాదని స్పష్టమవుతోంది. రాజకీయ వ్యూహప్రతివ్యూహాల మధ్యే సోమవారం షెడ్యూల్ ఖరారైంది. కేసీఆర్ మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి రావడం రేవంత్ రెడ్డికి సవాల్‌గా మారనుంది. మరోవైపు రేవంత్ పథకాల అమలు కేసీఆర్ విమర్శల ధాటిని తట్టుకోగలదా అన్నది ప్రశ్నార్థకం. జగిత్యాలలో జీవన్ రెడ్డి చేరిక బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని మార్చగలదా అనేది చూడాలి. రైతు భరోసా నిధుల పంపిణీ ద్వారా రేవంత్ రెడ్డి గ్రామీణ ఓటర్లను తన వైపు తిప్పుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈ పోరులో ఎవరిది పైచేయి అనేది సభల ముగింపు తర్వాత లభించే ప్రజా స్పందనను బట్టి తెలుస్తుంది.

## మండే ఎండలు.. ఎండుతున్న గొంతులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కరీంనగర్ పౌర జీవనానికి తలమానికంగా, ఉత్తర తెలంగాణ జిగురుటాకులకు జలసిరిని పంచే దిగువ మానేరు జలాశయం నేడు అస్తిత్వ పోరాటం చేస్తోంది. దశాబ్దాలుగా కోట్లాది గొంతుల దాహం తీరుస్తూ, లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న ఈ జలాశయం ప్రస్తుతం కరీంనగర్ నగర వ్యర్థాలకు వేదికగా మారుతోంది. నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్న ఈ జలనిధి క్రమంగా తన సహజ రూపాన్ని కోల్పోయి మురికి కూపంగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నగరాభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం మానేరు ఉనికికే ముప్పు తెచ్చిపెడుతోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో కళకళలాడే రిజర్వాయర్ పరిసరాల్లో నేడు టిప్పర్లు, ట్రాక్టర్ల రొద వినిపిస్తోంది. కూల్చిన పాత భవనాల శిథిలాలు, తవ్విన మట్టిని తీసుకొచ్చి నేరుగా జలాశయం గర్భంలోనే నింపేస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా యథేచ్ఛగా సాగుతున్న ఈ దందా వల్ల నీటి నిల్వ ఉండాల్సిన చోట మట్టి దిబ్బలు వెలుస్తున్నాయి. ఈ వ్యర్థాలు నీటి ప్రవాహానికి అడ్డుగా మారి, జలాశయం లోతును క్రమంగా తగ్గించేస్తున్నాయి. చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోతుండటం వల్ల మానేరు జలాశయం కాస్త డంపింగ్ యార్డ్‌ను తలపిస్తూ పర్యావరణ వేత్తలను కలవరపెడుతోంది. వర్షాలు పడిన ప్రతిసారీ ఈ వ్యర్థాలలోని రసాయనాలు, ప్లాస్టిక్ శకలాలు నీటిలో కలిసిపోతున్నాయి. దీనివల్ల జలచరాలు, ముఖ్యంగా చేపల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. కలుషిత నీటి కారణంగా చేపలు మృత్యువాత పడుతుండటంతో మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. నీటి నాణ్యత దెబ్బతినడం వల్ల జలాశయం నుంచి సరఫరా అయ్యే తాగునీరు కూడా కలుషితమవుతోంది. సాగునీటి కోసం ఎదురుచూసే రైతులకు ఈ మట్టి ప్రవాహం వల్ల కాలువలు పూడిపోయే ప్రమాదం పొంచి ఉంది. మానేరు తీరమంతా దుర్వాసనతో నిండిపోయి పర్యాటక శోభను కోల్పోతోంది. జలాశయం నీటి నిల్వ సామర్థ్యంపై ఈ డంపింగ్ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. డెడ్ స్టోరేజీ లెవల్స్‌కు చేరుకున్నప్పుడు కొద్దిపాటి నీరైనా నగరం దాహార్తిని తీరుస్తుంది. అటువంటి కీలకమైన ప్రాంతాల్లో మట్టిని నింపడం వల్ల నీరు నిలిచే చోటును ఈ శిథిలాలు ఆక్రమిస్తున్నాయి. గతంలో ఉన్న పూర్తి స్థాయి సామర్థ్యం నేడు గణనీయంగా పడిపోయిందని గణాంకాలు చెబుతున్నాయి. అవక్షేపాలు అడుగున పేరుకుపోవడం వల్ల జలాశయం ఆయుష్షు తగ్గిపోతోంది. భవిష్యత్తులో తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఏర్పడితే ప్రత్యామ్నాయ మార్గాలు లేక నగరవాసులు అల్లాడిపోయే ప్రమాదముంది.



స్థానిక నివాసితులు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. డంపింగ్ చేసిన చెత్తను తగలబెడుతుండటం వల్ల వెలువడే దట్టమైన పొగ చుట్టుపక్కల ప్రాంతాలను కమ్మేస్తోంది. వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగిపోయి గాలి నాణ్యత క్షీణిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టిలో కలవకుండా ఏళ్ల తరబడి అలాగే ఉండిపోయి భూగర్భ జలాలను కూడా విషతుల్యం చేస్తున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు ఈ కాలుష్యం బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టాలు అమలులో ఉన్నప్పటికీ మానేరు గర్భం ఛిద్రమవుతుండటం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం ఉండటం లేదని బాధితులు వాపోతున్నారు. డంపింగ్ ప్రక్రియను అడ్డుకోవాల్సిన విభాగాలు మౌనం వహించడం వల్ల అక్రమార్కులు మరింతగా రెచ్చిపోతున్నారు. వ్యర్థాల నిర్వహణ కోసం నగరపాలక సంస్థ నిర్దిష్టమైన ప్లాంట్లు ఏర్పాటు చేయకుండా జలాశయ ప్రాంతాన్ని సులభమైన మార్గంగా ఎంచుకోవడం శోచనీయం. నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగ కేంద్రాలు లేకపోవడం వల్ల నగరంలోని శిథిలాలన్నీ మానేరు ఒడిలోకి చేరుతున్నాయి. ఈ విధాన లోపాలు పర్యావరణానికి శాపంగా మారుతున్నాయి. ప్రజల నిరసనలు ఉధృతమవుతున్నా క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదు. జలాశయ రక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. డంపింగ్ చేసే వాహనాలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు వాటిని సీజ్ చేయాలి.

## మండే ఎండలు.. గాలులువర్షాలు

**మొదటిపేజీ తరువాయి**

వేళల్లో అకస్మాత్తుగా విరుచుకుపడే ఈదురుగాలులు, వానలు కలవరపెడుతున్నాయి. ఏప్రిల్ 22వ తేదీ వరకు రాష్ట్రంలోని వాతావరణంలో ఊహించని మార్పులు సంభవిస్తాయని, పగటి వేళల్లో నిప్పుల కొలిమిని తలపించేలా భానుడి ప్రతాపం కొనసాగుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దుల గుండా వీస్తున్న వేడి గాలులు తోడవడంతో భూమి మరింతగా వేడెక్కి మధ్యాహ్న సమయాల్లో కర్ఫ్యూ వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితుల ప్రకారం రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ నుంచి ఏకంగా 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. గత కొన్నేళ్లుగా నమోదైన గణాంకాలను పరిశీలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత ప్రారంభంలోనే రికార్డులను తిరగరాసేలా ఉంది. ఎండ దెబ్బకు భూమి లోపలి తేమ శాతం కూడా గణనీయంగా తగ్గిపోవడంతో సామాన్య ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు పగటివేళ ఎండ ప్రభావానికి గురైతే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఉష్ణోగ్రతల పెరుగుదలకు ఒక ప్రధాన కారణం బంగాళాఖాతం వైపు నుంచి వచ్చే తేమ గాలులతో భూమిపై ఉండే వేడి గాలులు కలవడమేనని వాతావరణ శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత శిఖర స్థాయికి చేరుకుంటుంది. ఈ సమయంలో బయటకు వచ్చే వ్యక్తులపై అతినీలలోహిత కిరణాల ప్రభావం నేరుగా పడి చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని భయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఈ వేడి తట్టుకోలేక అల్లాడిపోతుండగా, నగరాల్లో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వేచి ఉండే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పగటిపూట మండుతున్న ఎండలు సాయంత్రం అయ్యేసరికి ఊహించని విధంగా వర్షాలకు దారితీయడం ఒక వింతైన పరిణామంగా కనిపిస్తోంది. తీవ్రమైన వేడి



కారణంగా భూమిపై ఉండే గాలి వేగంగా పైకి ఎగబాకి భారీ కుమ్యులోనింబస్ మేఘాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఈ మేఘాల కారణంగా సాయంత్రం వేళల్లో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉంది. గాలి వేగం గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, ఇది బలహీనంగా ఉన్న విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మలను పడగొట్టే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న ఈ అనూహ్య మార్పుల వల్ల ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ వంటి ప్రాంతాల్లో ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. మరోవైపు రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ వంటి పట్టణ ప్రాంతాల్లో సాయంత్రం వేళ కురిసే గాలివానల వల్ల జనజీవనం స్తంభించే అవకాశం ఉంది. నల్లని మేఘాలు ఆకాశాన్ని కమ్మేసినప్పుడు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారు. బయట ఉన్న హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ విభాగం స్పష్టం చేస్తోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నగరంలోని కాంక్రీట్ భవనాలు వేడిని త్వరగా గ్రహించి రాత్రిపూట కూడా ఉక్కపోతను కలిగిస్తున్నాయి. ప్రజలు తమ ఇళ్లకు కిటికీలు తెరిచి ఉంచాలని, గాలి ప్రసరణ ఉండేలా చూసుకోవాలని ఆరోగ్య శాఖ సూచిస్తోంది. శరీరాన్ని చల్లబరుచుకునేందుకు ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవడం ఉత్తమం. బయటకు వెళ్ళే సమయంలో తలపాగా కట్టుకోవడం లేదా గొడుగు వాడడం ద్వారా వడదెబ్బ నుంచి కొంతవరకు ఉపశమనం పొందవచ్చు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందడం ప్రాణాంతకమని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ఇనుప కడ్డీలు లేదా విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలి. వాహనాలు నడిపే వారు వర్షం పడే సమయంలో వేగాన్ని తగ్గించి రోడ్డు పక్కన సురక్షిత ప్రాంతాల్లో నిలుపుకోవాలి. మట్టి మిద్దెలు, పాత గోడలు ఉన్న ఇళ్లలో నివసించే వారు గాలివాన వచ్చే సమయంలో పొరుగున ఉన్న పక్కా భవనాలకు వెళ్లడం క్షేమం. పెంపుడు జంతువులను కూడా ఎండ నుండి కాపాడటానికి నీడ ఉన్న చోట ఉంచడం బాధ్యతగా గుర్తించాలి. విద్యార్థులు, పాఠశాలల పనివేళల విషయంలో ప్రభుత్వం ఇప్పటికే నిబంధనలు జారీ చేసినప్పటికీ, సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో వానల నుంచి జాగ్రత్త వహించాలి. ఈదురుగాలులు వీస్తున్నప్పుడు పిడుగుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎండ ప్రభావం వల్ల శరీరంలోని నీటి శాతం తగ్గి నీరసం రాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు లేదా గ్లూకోజ్ తీసుకోవడం అవసరం. ఆహార నియమాల్లో కూడా మార్పులు చేసుకుని జీర్ణం కావడానికి సులభంగా ఉండే పదార్థాలను భుజించాలి. కారం, మసాలా దినుసులు తగ్గించడం వల్ల శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుందని వైద్యులు సలహా ఇస్తున్నారు.

## అమెరికా- ఇరాన్ రెండో విడత చర్చలు

**మొదటిపేజీ తరువాయి**

డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ధ్రువీకరించారు. నేడు ఇస్లామాబాద్‌లో అమెరికా ప్రతినిధులు ఇరాన్ బృందంతో ముఖాముఖి భేటీ అవుతారని స్పష్టం చేశారు. ఈ చర్చల కోసం ఇప్పటికే పాక్ ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. అమెరికా అడ్వాన్స్ సెక్యూరిటీ బృందాలు సైతం ఇస్లామాబాద్‌కు చేరుకుని పరిస్థితులను పర్యవేక్షిస్తున్నాయి. తొలి విడత చర్చలకు జేడీ వాన్స్ నాయకత్వం వహించగా, తాజా చర్చల్లో పాల్గొనే ప్రతినిధుల వివరాలను ట్రంప్ ప్రస్తుతానికి గోప్యంగా ఉంచారు. అంతర్జాతీయ సమాజం ఈ భేటీపై గంపెడంత ఆశలు పెట్టుకుంది. ఇరాన్ తీరుపై ట్రంప్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న నౌకలపై ఇరాన్ దాడులకు తెగబడటం శాంతి ప్రయత్నాలకు గొడ్డలి పెట్టు వంటిదని ఆయన అభివర్ణించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ, శనివారం నాడు ఇరాన్ బలగాలు ట్యాంకర్లపైకి కాల్పులు జరపడం నిబంధనలను ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. ముఖ్యంగా ఫ్రెంచ్, బ్రిటన్ నౌకలతో పాటు భారతీయ నౌకలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ బుల్లెట్లతో సమాధానం చెప్పాలని చూస్తే తాము అంతకంటే శక్తిమంతమైన రీతిలో స్పందిస్తామని హెచ్చరించారు. దౌత్య మార్గాల్లో సమస్యను పరిష్కరించుకునేందుకు తమ ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారని, అయితే అది ఇరాన్ ప్రవర్తనపైనే ఆధారపడి ఉంటుందని తేల్చి చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. తాము ప్రతిపాదిస్తున్న న్యాయమైన ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోతే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని అల్టిమేటం ఇచ్చారు. ఇరాన్‌లోని పౌర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా దాడులు చేస్తామని, ఆ దేశంలోని ప్రతి విద్యుత్ ప్లాంటును, వంతెనను నేలమట్టం చేస్తామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. గత 47 ఏళ్లలో అమెరికా అధ్యక్షులు ఎవరూ చేయని సాహసాన్ని తాను చేసి చూపిస్తానని, ఇరాన్‌ను అత్యంత వేగంగా పతనం చేస్తానని హెచ్చరించారు. మునుపటిలా తాను మెతక వైఖరి అవలంబించబోనని, ఈసారి చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఇరాన్ తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చర్చల పట్ల



సానుకూలంగా వ్యవహరించాలని ఆయన కోరారు. హర్మూజ్ జలసంధి ముట్టడి వ్యవహారంలో ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. అమెరికా చేపట్టిన ముట్టడి వల్ల ఇరాన్‌కు ప్రతిరోజూ సుమారు 500 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోందని గణాంకాలతో వివరించారు. హర్మూజ్‌ను తామే మూసివేస్తే, తెలిసో తెలియకో ఇరాన్ కూడా తామే మూసివేస్తున్నట్లు ప్రకటించుకుని అమెరికాకు సాయం చేస్తోందని ఎద్దేవా చేశారు. ఈ ఆర్థిక దిగ్బంధం వల్ల అమెరికాకు వచ్చే నష్టమేమీ లేదని, తమకు కావలసిన ముడి చమురు టెక్సాస్, లూసియానా, అలస్కా ప్రాంతాల నుంచి సరిపడా అందుతోందని పేర్కొన్నారు. ఇరాన్ తన శక్తిని నిరూపించుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు వాస్తవానికి ఆ దేశ ఆర్థిక వ్యవస్థకే గొడ్డలి పెట్టుగా మారుతున్నాయని విశ్లేషించారు. బలవంతుడిగా కనిపించాలనే ఆరాటంలో ఇరాన్ ఐఆర్‌జీసీ తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దేశాన్ని పతనానికి చేరువ చేస్తున్నాయని విమర్శించారు. ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ అమెరికా ప్రకటనలపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇరాన్ ఓడరేవులను ముట్టడించడం ద్వారా అమెరికా అజ్ఞానాన్ని చాటుకుంటోందని మండిపడ్డారు. హర్మూజ్ జలసంధి గుండా తమ దేశ ఓడలు వెళ్లలేని పరిస్థితిని కల్పిస్తే, ఇతర ఏ దేశానికి చెందిన నౌకలను కూడా ఆ మార్గం నుంచి వెళ్లనిచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమకు అమెరికాపై చుక్కంత నమ్మకం కూడా లేదని, అయితే ప్రస్తుత తరుణంలో ప్రపంచ శాంతిని కాంక్షించి చర్చలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. దౌత్యపరమైన వ్యవహారాల్లో ఇరాన్ ఎప్పుడూ వెనకడుగు వేయబోదని, హక్కుల విషయంలో రాజీ పడేది లేదని ఘాలిబాఫ్ తేల్చి చెప్పారు. అమెరికా అహంకారం వల్లే ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని ఆరోపించారు. అమెరికా చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా మారుతున్నాయని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతీబ్జాదే ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికన్ల తప్పుడు లెక్కల వల్ల కాల్పుల విరమణ ఒప్పందం నీరుగారిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంతర్జాతీయ సమాజాన్ని పక్కదోవ పట్టించేలా ట్రంప్ ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. దౌత్య మార్గాల్లో చిత్తశుద్ధితో వ్యవహరించాల్సింది పోయి, బెదిరింపులకు దిగడం హేయమని పేర్కొన్నారు. ఏప్రిల్ 22న ముగియనున్న కాల్పుల విరమణ గడువులోగా శాంతి చర్చలు ఒక కొలిక్కి రావాలని, లేనిపక్షంలో పరిస్థితులు అదుపు తప్పుతాయని సూచించారు. ఇరాన్ ఎప్పుడూ ఘర్షణను కోరుకోదని, కానీ ఆత్మరక్షణ కోసం ఎలాంటి చర్యకైనా సిద్ధమని ప్రకటించారు. భారతదేశం కూడా ఇరాన్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. హర్మూజ్ జలసంధిలో రెండు భారతీయ నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ కాల్పులు జరపడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనపై నిరసన వ్యక్తం చేస్తూ ఢిల్లీలోని ఇరాన్ రాయబారికి భారత విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. భారతీయ నౌకలపై దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదని, సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత ప్రయాణానికి ఆటంకం కలిగించవద్దని భారత్ స్పష్టం చేసింది.

## గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

లోక్‌భవన్ వేదికగా జరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ శివప్రతాప్ శుక్లా భేటీ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆదివారం మధ్యాహ్నం అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ సమావేశం వెనుక ఉన్న అసలు కారణాలపై సచివాలయ వర్గాల నుంచి ఆసక్తికర సమాచారం బయటకు వస్తోంది. రాష్ట్ర మంత్రిమండలిలోని కీలక సహచరుడు మహమ్మద్ అజారుద్దీన్ పదవీ గండం నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయాల అమలులో రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలు ఎదుర్కొంటున్న చిక్కుముడులను విప్పేందుకు ఈ భేటీ ఒక వేదికగా నిలిచింది. రాష్ట్ర కేబినెట్‌లో క్రీడలు, మైనారిటీ సంక్షేమ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న అజారుద్దీన్ పదవీ కాలానికి సంబంధించిన సాంకేతిక సమస్య ఇప్పుడు ప్రభుత్వం ముందు అతి పెద్ద సవాల్‌గా నిలిచింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం చట్టసభల్లో సభ్యుడిగా లేని వ్యక్తి మంత్రిగా బాధ్యతలు చేపడితే ఆరు నెలల గడువులోపు శాసనసభ లేదా శాసనమండలికి తప్పనిసరిగా ఎన్నికవ్వాలి. ఈ నిబంధన గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తున్న తరుణంలో ఇప్పటి వరకు ఆయనకు ఎమ్మెల్సీగా గవర్నర్ కోటాలో ఆమోదం లభించకపోవడం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచింది. ఈ గడువు దాటితే మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళనతో రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కలిశారు. పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ ఫైళ్లకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు లోక్‌భవన్‌కు విజ్ఞప్తులు పంపినట్లు సమాచారం. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు అజారుద్దీన్ పేర్లను వెనక్కి పంపకుండా త్వరితగతిన ఆమోదించాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా అజారుద్దీన్‌కు సంబంధించిన దస్త్రంపై నెలకొన్న న్యాయపరమైన అంశాలను, అభ్యంతరాలను తొలగించే దిశగా గత మూడు రోజులుగా ముమ్మర కసరత్తు సాగింది. ఈ ప్రక్రియలో భాగంగానే లోక్‌భవన్ అధికారులతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. మంత్రి పదవిని కాపాడుకోవడమే కాకుండా శాసనమండలిలో ఖాళీలను భర్తీ చేయడమే లక్ష్యంగా ఈ భేటీ సాగింది. ముఖ్యమంత్రి భేటీకి ఒకరోజు ముందే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి లోక్‌భవన్‌కు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. గవర్నర్‌తో సుదీర్ఘంగా చర్చించిన వీరు న్యాయపరంగా ఉన్న ఇబ్బందులను వివరించినట్లు తెలుస్తోంది. గతంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామక ప్రక్రియపై కోర్టుల నుంచి వచ్చిన తీర్పులను, ప్రస్తుత ప్రతిపాదనలకు ఉన్న చట్టబద్ధతను ఏజీ ప్రత్యేకంగా వివరించారు. ప్రభుత్వ ప్రతిపాదనలను రాజ్యాంగ నిబంధనల వెలుగులో పరిశీలించాలని కోరుతూ ప్రభుత్వం తరపున గట్టి విజ్ఞప్తిని



గవర్నర్ ముందు ఉంచారు. అధికారుల భేటీ అనంతరం రేవంత్ రెడ్డి వెళ్లడం ద్వారా దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు సార్లు అధికారికంగా లోక్‌భవన్‌కు లేఖలు రాసినట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో జాప్యం జరగడం వల్ల పాలనాపరమైన చిక్కులు ఎదురవుతున్నాయని ముఖ్యమంత్రి గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అజారుద్దీన్ పదవి విషయంలో ఈ నెలాఖరు వరకు కాలపరిమితి ఉండటం వల్ల గడువు ముగిసేలోపే నోటిఫికేషన్ వెలువడేలా చూడాలని కోరారు. గవర్నర్ అడిగిన కొన్ని సాంకేతిక వివరాలను ప్రభుత్వం తరపున రేవంత్ రెడ్డి స్వయంగా అందజేశారు. ఒకవేళ ఈ ఆమోదం ఆలస్యమైతే ఏర్పడే రాజకీయ పరిణామాలను సైతం సున్నితంగా ప్రస్తావించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర మంత్రిమండలిలో క్రీడా రంగానికి విశేష గుర్తింపు తెచ్చిన అజారుద్దీన్‌ను పదవి నుంచి తొలగించాల్సి వస్తే అది ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలుగుతుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే అటు న్యాయ వ్యవస్థను, ఇటు రాజ్యాంగబద్ధమైన లోక్‌భవన్‌ను సమన్వయం చేస్తూ ఈ గండం నుంచి గట్టెక్కేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రొఫెసర్ కోదండరామ్ నియామకం ద్వారా విద్యావేత్తలకు, మేధావులకు గుర్తింపునిచ్చామని.. దీనిని గవర్నర్ సానుకూల దృక్పథంతో చూడాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ కోటా కాకుండా మేధావుల కోటా కింద వీరి పేర్లను ప్రభుత్వం గతంలోనే ఖరారు చేసింది. ఈ దస్త్రాలపై గవర్నర్ తీసుకునే నిర్ణయం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది. లోక్‌భవన్ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం అజారుద్దీన్‌పై ఉన్న కొన్ని పాత కేసుల వివరాలను గవర్నర్ కార్యాలయం నిశితంగా పరిశీలిస్తోంది. ఇవే అంశాలపై గతంలో ప్రభుత్వం పంపిన ఫైళ్లను వెనక్కి పంపిన దాఖలాలు ఉండటంతో ఈసారి న్యాయపరమైన చిక్కులు రాకుండా ఏజీ మార్గనిర్దేశంలో నివేదికను రూపొందించారు. అన్ని వివాదాలకు అతీతంగా అభ్యర్థుల పేర్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాజ్యాంగంలోని అధికరణ 171 ప్రకారం గవర్నర్‌కు ఉన్న విచక్షణ అధికారాన్ని వినియోగించి ప్రభుత్వం పంపిన పేర్లను ఆమోదించాలని విన్నవించారు. ఈ అంశంపై గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తున్నా తుది నిర్ణయంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ముఖ్యమంత్రి పర్యటన వెనుక కేవలం ఎమ్మెల్సీల అంశమే కాకుండా మంత్రివర్గ విస్తరణ ఊహాగానాలు సైతం బలంగా వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే యోచనలో రేవంత్ రెడ్డి ఉన్నట్లు చర్చ సాగుతోంది.

విశాల భారతి

# మియాపూర్‌లో ట్రాఫిక్ కష్టాలకు ఫుల్‌స్టాప్

## ఫుట్‌పాత్‌లు క్లియర్ – పాదచారులకు భరోసా
## యూటర్న్‌లు మార్పు – రద్దీకి ఉపశమనం

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా జి.ప్రశాంత్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మియాపూర్ మెట్రో స్టేషన్, హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్, బాచుపల్లి క్రాస్ రోడ్స్, ఆల్విన్ కాలనీ జంక్షన్, మదీనాగూడ సర్కిల్ పరిసరాల్లో ట్రాఫిక్ పూర్తిగా మారిపోయింది. గతంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు బారులు తీరి నిలిచిపోయేవి. ఇప్పుడు సిగ్నల్ పడిన వెంటనే వాహనాలు కదులుతున్నాయి. ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతున్నారు, కొత్త ఆలోచనలతో ప్రయాణికుల ఇబ్బందులను తొలగిస్తున్నారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు, పాదచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఫుట్‌పాత్ ఆక్రమణలకు చెక్...**

గతంలో ఫుట్‌పాత్‌ల మీద తోపుడు బండ్లు, బైక్‌లు, నిర్మాణ వ్యర్థాలు పెట్టేసి పాదచారులకు నడిచే దారి లేకుండా చేసేవారు. ఇప్పుడు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే సిబ్బందితో ఫుట్‌పాత్ క్లియరెన్స్ చేయిస్తున్నారు. ఆక్రమణదారులకు మొదట వార్నింగ్ ఇచ్చి,వినకపోతే జరిమానా వేస్తున్నారు. “పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లాలంటే రోడ్డు మీదే నడిచేవాళ్లం. ఇప్పుడు ఫుట్‌పాత్ ఖాళీగా ఉంచుతున్నారు. భయం లేకుండా నడుస్తున్నాం” అని మదీనాగూడ స్థానికులు చెబుతున్నారు. “వీల్‌చైర్ ర్యాంప్‌లు బ్లాక్ చేస్తే ఫోటో పంపిన 10 నిమిషాల్లో క్లియర్ చేయిస్తున్నారు” అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


మియాపూర్ లో ట్రాఫిక్ సిఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో చేపట్టిన నూతన మార్పులు, యూటర్న్‌లు

**యూ-టర్న్‌లతో ట్రాఫిక్‌కు ఊరట..**

బాచుపల్లి క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న యూటర్న్ వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయేవి. ఆ సమస్యను గుర్తించి, రద్దీ ఎక్కువగా ఉన్న చోట ఉన్న యూటర్న్‌ను తొలగించి 180 మీటర్లు ముందుకు, వాహనాలు సాఫీగా వెళ్లే చోట కొత్త యూటర్న్ ఏర్పాటు చేయిస్తున్నారు. హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ కింద అనవసరంగా ఉన్న యూటర్న్‌ను మూసివేయించి, 300 మీటర్ల దూరంలో విశాలమైన చోట కొత్తది ఇప్పిస్తున్నారు. “ముందు యూటర్న్ కోసం 15 నిమిషాలు ఆగేవాళ్లం. ఇప్పుడు 2 నిమిషాల్లో దాటేస్తున్నాం” అని క్యాబ్ డ్రైవర్ ఇమ్రాన్ తెలిపారు. దీంతో సిగ్నల్ టైమింగ్ కూడా తగ్గించి వాహనాలు వేగంగా కదిలేలా చేయిస్తున్నారన్నారు.

**కొత్త ఆలోచనలతో ప్రయాణికులకు ఊరట..**


మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద పిల్లర్ నంబర్లతో ‘పికప్ ఓన్లీ’, ‘డ్రాప్ ఓన్లీ’ పాయింట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. ఆటోలు, క్యాబ్‌లు ఎక్కడపడితే అక్కడ ఆగకుండా చేస్తున్నారు. స్కూల్ టైమ్‌లో ఆల్విన్ కాలనీ రోడ్డును వన్‌వే చేస్తున్నారు. వాట్సాప్ కంప్లైంట్ వస్తే 15 నిమిషాల్లో సిబ్బందిని పంపిస్తున్నారు. “మూడు సార్లు ఫిర్యాదు చేశాను. మూడుసార్లూ పరిష్కారం చేశారు” అని స్థానికుడు రమేష్ చెబుతున్నారు.

### ప్రయాణికులు, స్థానికులు హర్షం



రోజూ గచ్చిబౌలి వెళ్లి వచ్చేటప్పుడు “మియాపూర్ దాటడమే పెద్ద టాస్క్‌గా ఉండేది. ఇప్పుడు స్మూత్‌గా వెళ్తున్నాను. టైం, పెట్రోల్ రెండూ మిగులుతున్నాయి. ఇలాంటి మార్పులు చేస్తున్నారు కాబట్టే థాంక్స్ చెబుతున్నామని సాఫ్ట్వేర్ ఉద్యోగి ఆకాష్ ఆనందాన్ని వెలిబుచ్చాడు.

- ఆకాష్ సాఫ్ట్ వేర్ ఉద్యోగి



”ఆర్టీసీ బస్సు డ్రైవర్ మల్లేశం చెబుతూ.. “బస్ బే లోపలికి ఆటోలు రాకుండా బారికేడ్లు పెట్టిస్తున్నారు. టైంకు ట్రిప్పు తిరుగుతున్నాను.”గత మూడు నెలల్లో మియాపూర్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు 38% తగ్గించారు. ఫేటల్ యాక్సిడెంట్లు జీరో. అంబులెన్స్‌లకు గ్రీన్ ఛానల్ ఇప్పిస్తున్నారు. చలాన్ల కంటే అవగాహనకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

- మల్లేష్,ఆర్టీసీ డ్రైవర్

### అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం



మియాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విధుల పట్ల అంకితభావం చూపిస్తున్నారు, కష్టపడి పనిచేస్తున్నారు, ప్రతినిత్యం అందుబాటులో ఉంటున్నారు, బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు అని ప్రజలు చెబుతున్నారు. ప్రశాంత్‌ను ఆదర్శంగా తీసుకుని ఇతర అధికారులు కూడా ఇలాగే పనిచేస్తే మొత్తం నగరంలో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, ప్రయాణం సాఫీగా సాగుతుందని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. ఇలాంటి చిత్తశుద్ధి, జవాబుదారీతనం ప్రతి అధికారిలో ఉండాలని మియాపూర్ ప్రజలు కోరుకుంటున్నారు. “వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి. అంబులెన్స్‌కు దారి ఇవ్వాలి, మద్యం తాగి వాహనం నడపకూడదు. నిబంధనలు పాటించి మీ ప్రాణాలు, ఇతరుల ప్రాణాలు కాపాడుకోవాలి.”


- ప్రశాంత్, సీఐ మియాపూర్ ట్రాఫిక్

# వీకెండ్ డ్రంక్ డ్రైవ్‌లో 315 మందిపై కేసులు


డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

**సైబరాబాద్‌విశాలభారతి:** వీకెండ్ స్పెషల్ డ్రంక్ డ్రైవ్‌లో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 315 మందిపై కేసులు నమోదు చేశారని ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ తెలిపారు. వీరిలో 268 మంది ద్విచక్ర వాహనదారులు, 15 ఆటోలు, 28 కార్లు, 4 హెవీ వాహనదారులు ఉన్నారు.బీఏసీ ఆధారంగా 277 మంది 36200 ఎంజీ, 27 మంది 201300 ఎంజీ, 11 మంది 301550 ఎంజీ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే బీఎన్ఎస్2023 సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని, గరిష్టంగా 10 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తామని డీసీపీ హెచ్చరించారు. గత వారం 120 డ్రంక్ డ్రైవింగ్ కేసులు పరిష్కారం కాగా 119 మందికి జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించారు.

# కాలనీ సమస్యలు పరిష్కరిస్తాగంగాధర్ రెడ్డి


గంగాధర్ రెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** నల్లగండ్ల హుడా కాలనీవాసుల ఆహ్వానం మేరకు సమావేశానికి హాజరైన మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డికి కాలనీవాసులు భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల మరమ్మత్తులు, మంచినీటి కనెక్షన్లు, విద్యుత్ అంతరాయాలు, హౌస్ ట్యాక్స్, రాక్ గార్డెన్ పార్క్, ఓపెన్ జిమ్, చిల్డ్రెన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని విన్నవించారు.ఈ సందర్భంగా గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ “కాలనీ సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తా. ప్రజలకు మౌలిక వసతులు, ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యం” అని అన్నారు. వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

# గచ్చిబౌలిలో దారుణం

**స్కూటీ కొట్టేసి ఇదేంటని అడిగితే చితకబదిన కానిస్టేబుల్..!**


గాయపడిన భాధితుడు


కానిస్టేబుల్ ఫైల్ ఫోటో

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** మద్యం మత్తులో ఓ కానిస్టేబుల్ యువకులపై దాడి చేసిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఓ జిమ్లో ఇద్దరు అన్నదమ్ములు కోచింగ్ తీసుకుంటున్నారు. అదే జిమ్ పార్కింగ్లో యాక్టివా రెడ్ కలర్ వెహికల్ పార్క్ చేసి జిమ్ కోచింగ్కి వెళ్లారు.యాక్టివా లాక్ చేసి లేకపోవడంతో ఓ కానిస్టేబుల్ పార్కింగ్ నుంచి యాక్టివా వాహనం తీసుకెళ్లి దగ్గరలోని టీ స్టాల్ దగ్గర టీ తాగుతున్నాడు. ఇంటికి వెళ్లేందుకు జిమ్ నుంచి బయటకు వచ్చిన అన్నదమ్ములకు యాక్టివా స్కూటీ కనిపించలేదు. ఆ చుట్టుపక్కల వెతకగా.. దగ్గరలోని టీ స్టాల్ దగ్గర వెహికల్ చూసి ఈ స్కూటీ నాది అన్న' అని సదరు కానిస్టేబుల్తో అన్నదమ్ముల్లో ఒకరు మాట్లాడుతున్నారు.అయితే.. ఒక పక్క మాట్లాడుతుండగానే.. కానిస్టేబుల్, అతని స్నేహితులు కలిసి అన్నదమ్ములు ఇద్దరినీ చితకబాదారు. కానిస్టేబుల్ పూర్తిగా మద్యం మత్తులో ఉన్నాడు. దుర్భాషలాడుతూ.. అన్నదమ్ములపై కానిస్టేబుల్, అతని స్నేహితులు కలిసి దాడి చేశారు .ఈ గొడవకు కారణమైన కానిస్టేబుల్పై బాధితులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితులకు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# “అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది”

**- పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**



అన్నప్రసాదం వడ్డిస్తున్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** ఇస్కాన్ సైబరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని అన్నప్రసాదాలు వడ్డించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది. పేద ప్రజల ఆకలి తీర్చడం గొప్ప విషయం. ఇస్కాన్ సైబరాబాద్ వారు ఆసుపత్రుల్లో రోగులకు, ప్రభుత్వ బడుల విద్యార్థులకు, పేదలకు నిత్యం ఉచిత అన్నదానం చేస్తున్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం, యువతకు కౌన్సిలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి మంచి జీవితం అందిస్తున్నారు” అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, మంత్రిప్రగడ సత్యానారాయణ, నాయి నేనీ చంద్రకాంత్ రావు, అనిల్, ప్రభాకర్ రెడ్డి, ఇస్కాన్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన సైబరాబాద్ మనందరి బాధ్యత

**ఆరెకపూడి గాంధీ**



పరిశుభ్రతా కార్యక్రమం ప్రారంభించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** “స్వచ్ఛమైన సైబరాబాద్ తీర్చిదిద్దడంలో ప్రజలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు భాగస్వాములు కావాలి” అని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఆదివారం టీఎన్జీవోఎస్ కాలనీలో పరిశుభ్రతా ప్రత్యేక కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ చెత్త తొలగింపునకు ప్రతి విభాగానికి వాహనం, నిర్మాణ వ్యర్థాలకు రెండు విభాగాలకు ఒక టిప్పర్, యంత్రం ఏర్పాటు చేశామని గాంధీ తెలిపారు. ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, విద్యుత్, ఉద్యాన విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు.పారిశుద్ధ్య సిబ్బంది కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి తొలి చైర్మన్ స్వామి గౌడ్, డీసీ సేవా ఇస్లావత్, కార్పొరేషన్ అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అహింస పరమో ధర్మః” సూత్రం నేడు మరింత అవసరంజగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** “అహింస పరమో ధర్మః అనే సూత్రం విభేదాలు పెరుగుతున్న నేటి సమాజంలో మరింత అవసరం. ఈ అహింస స్తంభం కేవలం నిర్మాణం కాదు, శాంతి, దయ, సహజీవనానికి ప్రతీక. మహావీర్ చూపిన మార్గంలో నిజమైన శక్తి క్షమ, వినయంలోనే ఉంది” అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు.ఆదివారం హఫీజ్‌పేట్ వైశాలి నగర్, మజీరా రోడ్డులో జరిగిన జైన అహింస స్తంభం శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అహింస అంటే మాటల్లో మాధుర్యం, ఆలోచనల్లో పవిత్రత, చర్యల్లో దయ అని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు రమణమూర్తి, బల్లింగ్ యాదగిరి గౌడ్, కనకమామిడి నరేందర్ గౌడ్, శాస్త్రి, రంగారావు, జైన్ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.


జైనులతో కలిసి అహింస స్తంభం శంకుస్థాపన చేసిన జగదీశ్వర్ గౌడ్

# లివేటెడ్ కారిడర్‌కే ప్రజల డిమాండ్

**ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**




**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపల్ కేంద్రంలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి పనులను వెంటనే నిలిపివేసి, ప్రజలకు అనుకూలంగా ఉండే ఎలివేటెడ్ కారిడర్ నిర్మించాలని మిత్రపక్షాల ఆధ్వర్యంలో, సిపిఎమ్ నేతృత్వంలో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మట్టి ఆధారంగా నిర్మిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి వల్ల చౌటుప్పల్ పట్టణం రెండు భాగాలుగా విభజించబడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, రోజువారీగా వేలాది మంది ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక వ్యాపారాలపై కూడా ఈ నిర్మాణం తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. మట్టి బ్రిడ్జి కారణంగా దుకాణాలకు వచ్చే కస్టమర్ల సంఖ్య తగ్గిపోవడం, సరుకు రవాణా కష్టతరం కావడం వంటి సమస్యలు తలెత్తి, చిన్న వ్యాపారులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా, వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, రోడ్డు మునిగిపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందని హెచ్చరించారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, పిల్లర్ ఆధారిత ఎలివేటెడ్ కారిడర్ మాత్రమే శాశ్వత పరిష్కారమని ఆయన పునరుద్ఘాటించారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వెంటనే స్పందించి, ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే జాతీయ రహదారి అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపిన ఆయన, అవసరమైతే మళ్లీ ఫీల్డ్ సర్వే నిర్వహించి, స్థానిక పరిస్థితులను వివరంగా చూపిస్తామని అన్నారు. అప్పటివరకు నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. అధికారులు స్పందించకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి,మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి,చౌటుప్పల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్,కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్,ఉదరి యాదయ్య,రాజరత్నం,సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి,గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ ఉడుగు మల్లేష్ గౌడ్, క్లాత్ అసోసియేషన్ వ్యాపారస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గడ్డి అన్నారం మార్కెట్‌లో రాజకీయ ఉద్రిక్తతలు

- రామ్ నర్సయ్యపై వైస్ చైర్మన్ ఘాటు విమర్శలు
- 8 కోట్ల అవినీతి చేసిన వ్యక్తికి నైతిక హక్కు లేదు
- చైర్మన్‌పై ఆరోపణలు చేస్తే తాట తీస్తామంటూ హెచ్చరిక


నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన లైసెన్సులు రద్దు చేయాలి
చైతన్యపురి, న్యూస్‌టుడే : గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను పదవి నుంచి తప్పించాలని కోరుతూ.. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముత్యంరెడ్డి, సభ్యులు ...
మంత్రి సబితారెడ్డికి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు

గతంలో రామ్ నర్సయ్య చేసిన అవినీతి పై వారి పాలకవర్గం సభ్యుల పిర్యాదు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ (AMC)లో రాజకీయ ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర చారి, మాజీ చైర్మన్ రామ్ నర్సయ్యపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం బాటసింగారం మార్కెట్ లో నిర్వహించిన ముఖ్య సభ్యుల సమావేశంలో ఈ విమర్శలు రాజకీయ వేడిని రాజేశాయి. ఈ సందర్భంగా భాస్కర చారి మాట్లాడుతూ.. 8 కోట్లకు పైగా అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన వ్యక్తి, ప్రస్తుత చైర్మన్‌పై పిచ్చి పిచ్చి ఆరోపణలు చేయడం అసహ్యకరం అని మండిపడ్డారు. గతంలో అక్రమంగా లైసెన్సులు జారీ చేసి భారీగా డబ్బులు వసూలు చేసిన విషయాలు అధికార విచారణలోనే బయటపడ్డాయని ఆయన ఆరోపించారు. నీ నోటీసులకు, బెదిరింపులకు ఎవరూ భయపడరు. మరోసారి మా చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పేరు తీస్తే తాట తీస్తాం అంటూ భాస్కర చారి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుత పాలకవర్గం మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తుంటే, గత అవినీతి మచ్చలను మోసుకొచ్చిన వ్యక్తులు విమర్శలు చేయడం రాజకీయ దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు.అదేవిధంగా, రామ్ నర్సయ్య తన పదవీకాలంలో ఎటువంటి తీర్మానం లేకుండా సుమారు 180 లైసెన్సులు జారీ చేసి కోట్ల రూపాయలు వసూలు చేశారని, ఆ ఆరోపణలే ఆయన సస్పెన్షన్‌కు కారణమయ్యాయని భాస్కర చారి పేర్కొన్నారు.

# తమిళనాడులో మృత్యుఘోష

**విశాలభారతి, జాతీయం:** తమిళనాడులోని విరుదునగర్ జిల్లాలో ఆదివారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. కట్టనార్‌పట్టి సమీపంలోని ఒక బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన భారీ పేలుడు పదుల సంఖ్యలో కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. ఈ ప్రమాద ధాటికి సుమారు 18 మంది కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరి కొందరు తీవ్ర గాయాలపాలయ్యారు. మృతుల్లో అత్యధికంగా నిరుపేద కూలీలే ఉన్నట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలంలో మంటలు ఆకాశాన్ని తాకుతూ ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. శిథిలాల కింద ఇంకా కొందరు చిక్కుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతుండటంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. బాణసంచా పరిశ్రమకు పెట్టింది పేరైన విరుదునగర్ జిల్లాలో వేలాది మంది కార్మికులు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కట్టనార్‌పట్టి ప్రాంతంలో ముత్తు మునియాండి అనే వ్యక్తికి చెందిన ‘వనజ’ ప్రైవేటు బాణసంచా కర్మాగారంలో ఈ ఘోర ప్రమాదం సంభవించింది. యథావిధిగా ఆదివారం ఉదయం కార్మికులంతా తమ విధుల్లో నిమగ్నమయ్యారు. రసాయనాల మిశ్రమంతో బాణసంచా తయారు చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా నిప్పురవ్వలు చెలరేగి భారీ శబ్దంతో పేలుడు చోటుచేసుకుంది. ఈ ధాటికి కర్మాగారంలోని సుమారు నాలుగు భవనాలు పేకమేడల్లా కూలిపోయి నేలమట్టమయ్యాయి. ఆ భవనాల్లో పని చేస్తున్న వారు ప్రాణాలు కాపాడుకునే లోపే మంటలు చుట్టుముట్టాయి. ప్రమాద తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే పేలుడు శబ్దం కిలోమీటర్ల దూరం వరకు వినిపించింది. పేలుడు సంభవించిన వెంటనే స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కర్మాగారం నుంచి నల్లటి పొగ మేఘాలు కమ్ముకోవడంతో పాటు మందుగుండు సామాగ్రి నిరంతరాయంగా పేలుతూనే ఉంది. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ లోపల ఉన్న రసాయనాల వల్ల మంటలు అదుపులోకి రాలేదు. సహాయక చర్యలకు నిప్పురవ్వలు ఆటంకంగా మారడంతో రెస్క్యూ టీమ్ ఆచితూచి అడుగులు వేయాల్సి వచ్చింది. పేలుడు ధాటికి భవనాలు కూలిపోవడంతో లోపల ఉన్న కార్మికులు బయటకు రాలేకపోయారు. శిథిలాల కింద చిక్కుకున్న సుమారు 18 మంది శరీరాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయి సజీవ దహనం అయ్యారు. మృతదేహాలు ఛిద్రమై అక్కడక్కడా పడి ఉండటం చూసి స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. గాయపడిన వారిని శిథిలాల నుంచి వెలికి తీసిన సిబ్బంది అంబులెన్స్‌ల ద్వారా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. వారి శరీరాలు 80 శాతం పైగా కాలిన గాయాలతో ఉండటంతో ప్రాణాపాయం పొంచి ఉందని సమాచారం. జిల్లా అధికార యంత్రాంగం సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించింది.



మృతుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కర్మాగారంలో నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ముందస్తు అనుమతులు ఉన్నాయా, పనివేళల్లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలపై పోలీసులు కర్మాగారం యజమాని ముత్తు మునియాండిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రసాయనాల నిల్వ విషయంలో అజాగ్రత్త వహించడం వల్లే ఈ స్థాయిలో ప్రాణనష్టం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. యజమాని నిర్లక్ష్యం రుజువైతే కఠిన చర్యలు తప్పవని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో ఆసుపత్రి ప్రాంగణం నిండిపోయింది. కూలి పనులకు వెళ్లి శవాలై వస్తారని ఊహించలేదని బాధితులు బోరున విలపిస్తున్నారు. విరుదునగర్ జిల్లాలో బాణసంచా ప్రమాదాలు నిత్యకృత్యం కావడంతో కార్మికుల రక్షణపై ఆందోళన పెరుగుతోంది. పరిశ్రమల శాఖ నుంచి సరైన నిఘా లేకపోవడం, తనిఖీల్లో ఉదాసీనత వల్లే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అవుతున్నాయని సామాజిక కార్యకర్తలు మండిపడుతున్నారు. నిరుపేద కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేలుడు ధాటికి కూలిపోయిన భవనాల కింద ఇంకా ఎవరైనా చిక్కుకుని ఉండవచ్చని రెస్క్యూ టీమ్ అనుమానిస్తోంది. జెసిబి యంత్రాల సహాయంతో శిథిలాలను తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది.

# భీంగల్ లో కుక్కల స్వైర విహారం

**ఏడుగురు చిన్నారులపై దాడి..**

**విశాలభారతి, భీంగల్ :** నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణ పరిధిలోగల వీధి కుక్కల స్వైర విహారం రోజురోజుకి మరింత పెరుగుతున్నాయి. భీంగల్ లోని,ప్రజలు, చిన్నారులు, బయటికి రావాలంటేనే జంకుతున్నారు. ఆదివారం నాడు జరిగిన విధి కుక్కల దాడులలో ఏడుగురు చిన్నారులు గాయపడినట్లు ప్రజలు తెలుపుతున్నారు. దీనితో వీధి కుక్కలు దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, స్పందించి, వీధి కుక్కల మరియు కోతుల బెడదను, నిర్మూలించాలని భీంగల్ పట్టణ ప్రజలు వాపోతున్నారు.

## హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ప్రైవేట్ కార్యక్రమంలో పరస్పర శుభాకాంక్షలు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు ను, స్థానిక ఎల్ బి నగర్ నియోజకవర్గం శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రస్తుత రాజకీయ పరిణామాలు వంటి అంశాలపై స్వల్పంగా చర్చించినట్లు సమాచారం. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగగా, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో నాలా పనులపై బీఆర్ఎస్ నాయకుల పరిశీలన



**రాజేంద్రనగర్, విశాలభారతి :** మణికొండ పంచవటి కాలనీ సమీపంలో బుల్కాపూర్ నాలా / పాండెన్వాగుపై కొనసాగుతున్న వర్షపు నీరు మరియు మురుగు నీటి పారుదల పనులను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నిర్వహణపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ అధికారులపై విమర్శలు గుప్పించారు. నాయకుల ప్రకారం, వర్షపు నీరు మరియు మురుగు నీటి పారుదల కోసం టెండర్ పిలిచినప్పటికీ, ప్రస్తుతం కేవలం మురుగు నీటి పారుదల కోసం మాత్రమే ఓపెన్ డ్రైన్ విధానంలో రిటైనింగ్ వాల్ పనులు జరుగుతున్నట్లు గమనించామని తెలిపారు. టెండర్‌లో పేర్కొన్నట్లు బాక్స్ డ్రైన్ రూపంలో బహుళ ప్రయోజనాల కలిగిన నిర్మాణం చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ఇక మణికొండ జాగీర్ సర్వే నంబర్ 65లో ఉన్న సుమారు 1 ఎకరం 30 గుంటల ప్రభుత్వ భూమిని సమగ్ర మార్కెట్ కోసం కేటాయించినప్పటికీ, ప్రస్తుతం కాంట్రాక్టర్ కార్యాలయంగా వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై ఆర్టీఐ దాఖలు చేసినా ఇప్పటివరకు సమాధానం రాలేదని తెలిపారు. అదేవిధంగా నివాస ప్రాంతం మరియు పార్క్ సమీపంలో రెడీ మిక్స్ కాంక్రీట్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల శబ్దం, ధూళి కాలుష్యం పెరిగి స్థానికుల ఆరోగ్యం దెబ్బతింటోందని పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్‌పై కంకర వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ ప్లాంట్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రతిపాదిత ఎస్‌టీపీ ఎత్తైన ప్రదేశంలో ఉండటం వల్ల పనితీరు సందేహాస్పదంగా ఉందని, నాలా వెంట ఉన్న ఇళ్ల మురుగు నీటి అవుట్‌లెట్ల భవిష్యత్తుపై స్పష్టత లేదని అన్నారు. ముఖ్యంగా పంచవటి కాలనీ రోడ్ నం. 10లో వరద నీటి నియంత్రణపై ఎటువంటి ప్రణాళిక కనిపించడంలేదని విమర్శించారు. ₹90 కోట్ల విలువైన ఈ పనిని అనుభవం లేని సంస్థకు అధిక వాటాతో ఇవ్వడం పలు అనుమానాలకు దారితీస్తోందని, టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. పనుల వివరాలు తెలియజేసే బోర్డులు కూడా ఎక్కడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రజల ప్రయోజనాలను కాపాడాలని బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, భాను చందర్ తదితరులు డిమాండ్ చేశారు.

## కాలేజీ ఏఓ వేధింపులకు విద్యార్థి బలి

- **హాల్ టికెట్ కోసం రూ.5 వేల డిమాండ్!**
- **అవమానం, ఒత్తిడితో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య**
- **ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కాలేజీ అధికారుల వేధింపులు, హాల్ టికెట్ కోసం డబ్బు డిమాండ్ కారణంగా ఓ బీటెక్ విద్యార్థి ప్రాణాలు తీసుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి గ్రామానికి చెందిన మయదారి రమేష్ (45) ప్రస్తుతం రాఘవేంద్ర నగర్ కాలనీలో నివసిస్తూ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు మయదారి ప్రణీత్ (21) శ్రీ ఇందు ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 17న హాల్ టికెట్ కోసం కాలేజీకి వెళ్లిన ప్రణీత్‌ను అక్కడ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) కృష్ణమూర్తి అడ్డుకున్నాడు. హాజరు తక్కువగా ఉందని కారణం చూపుతూ, హాల్ టికెట్ ఇవ్వాలంటే రూ.5,000 ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థి తన అనారోగ్య పరిస్థితిని వివరించినప్పటికీ, అతనిని ఇతర విద్యార్థుల ముందు అవమానించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రణీత్, 18వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఇన్స్పెక్టర్ తెలిపారు. మృతుని తండ్రి మయదారి రమేష్ ఫిర్యాదు మేరకు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని నాగరాజు గౌడ్ వెల్లడించారు. ఏఓ కృష్ణమూర్తిపై ఆత్మహత్యకు ప్రేరేపించడం, మానసిక వేధింపులు, అక్రమ వసూళ్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.పోలీసులు కాలేజీలో సాక్ష్యాధారాలను సేకరిస్తూ, సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నారని, అవసరమైతే కాలేజీ యాజమాన్యం పాత్రపై కూడా విచారణ విస్తరించనున్నట్లు చెప్పారు. దర్యాప్తులో తేలిన అంశాల ఆధారంగా నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ స్పష్టం చేశారు. ఈ ఘటనతో స్థానికంగా, విద్యార్థి వర్గాల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుని కుటుంబ సభ్యులు నిందితుడిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మహబూబాబాద్‌లో ఉచిత సమ్మర్ ఆర్చరీ శిక్షణ శిబిరం ప్రారంభం

- **విద్యార్థుల క్రీడా ప్రతిభ వికాసానికి అరుదైన అవకాశం**
- **విలువిద్యలో ప్రాథమిక శిక్షణతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపు**
- **ఏప్రిల్ 26 నుంచి నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ**
- **తల్లిదండ్రులకు పిలుపు – పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించండి**



**మహబూబాబాద్, విశాలభారతి:** పట్టణం మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, వారికి శారీరక దారుఢ్యం, ఏకాగ్రత మరియు క్రమశిక్షణను పెంపొందించేందుకు ఉచిత సమ్మర్ ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాచీనమైన మరియు ప్రతిష్ఠాత్మక క్రీడ అయిన విలువిద్యలో శిక్షణ పొందే ఈ శిబిరాన్ని తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్, ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్, వరంగల్ జిల్లా ఆర్చరీ అసోసియేషన్ మరియు శ్రీ సాదుల ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ శిక్షణ శిబిరం మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 26వ తేదీ నుండి ప్రారంభమై నెల రోజుల పాటు కొనసాగుతుంది. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుండి 6.30 గంటల వరకు శిక్షణ ఇవ్వబడుతుంది. 10 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలురు, బాలికలు ఈ శిబిరానికి అర్హులు. 4వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చు. ఈ శిక్షణ పూర్తిగా ఉచితంగా అందించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. శిబిరం ద్వారా విద్యార్థులకు ఆర్చరీలో ప్రాథమిక నైపుణ్యాలతో పాటు శారీరక దారుఢ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, పోటీ స్థాయి అవగాహన పెంపొందించబడుతుందని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు ఇది బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ పిల్లలలోని క్రీడా ఆసక్తిని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు. వేసవి సెలవులను విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా మార్చాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9394643139, 9494543139 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు సాదుల సారంగపాణి, డెవలప్మెంట్ మెంబర్ పుట్టా శంకరయ్య కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు.

# అక్రమ వసూళ్లలో "డిపిఓ" చేతివాటం..?

- **కురవి సంతలో నిబంధనలకు పాతర**
- **గుత్తేదారుల ఇష్టారాజ్యం, అధికారుల మౌనం..!**
- **రిజిస్ట్రేషన్ లేకుండానే అప్పగించిన గత కార్యదర్శి.**
- **గుత్తేదారికి నోటీసులు జారీ చేసిన ప్రస్తుత కార్యదర్శి.**
- **విచారణ జరిపి చర్యలు తీసుకోవడంలో విఫలం.**





**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన కురవి వారాంతపు సంత అక్రమాలకు నిలయంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న వసూళ్లు, నకిలీ రశీదుల వ్యవహారంపై రైతులు, వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఈ అక్రమ దందా సాగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**నిబంధనలు బేఖాతర్.. అక్రమ వసూళ్లు జోరు.**

కురవి సంతలో పశువులు, గొర్రెలు, మేకల అమ్మకాలు, కొనుగోళ్లపై గుత్తేదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. తై బజార్‌లో నకిలీ రశీదులు సృష్టించి వ్యాపారులను దోచుకుంటున్నారని సమాచారం. కనీస రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయకుండానే, గత పంచాయతీ కార్యదర్శి నిబంధనలకు విరుద్ధంగా సంతను గుత్తేదారుకు అప్పగించడం ఈ అక్రమాలకు పునాది పడిందని విమర్శలు వస్తున్నాయి.

**నోటీసులు ఇచ్చినా ఆగని దందా.**




ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి ఈ అవకతవకలను గుర్తించి గుత్తేదారుకు నోటీసులు జారీ చేసినప్పటికీ, పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. గుత్తేదారు తన పద్ధతి మార్చుకోకుండా యథేచ్ఛగా అక్రమ వసూళ్లకు పాల్పడుతుండటం గమనార్హం.

**జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువు.**

సంతలో జరుగుతున్న దోపిడీపై స్వయంగా వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వారం రోజులు గడుస్తున్నా, ఇప్పటి వరకు ఎటువంటి విచారణ జరగకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా పంచాయతీ అధికారులు గుత్తేదారుతో కుమ్మక్కయ్యారని, అందుకే చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**విచారణ జరపాలని రైతుల డిమాండ్.**

కష్టపడి పెంచిన పశువులను విక్రయించుకోవడానికి వస్తున్న తమను గుత్తేదారులు వేధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయాలని రైతులు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంపై జిల్లా పంచాయతీ అధికారికి "విశాల భారతి" ప్రతినిధి ఫోన్ చేయగా అందుబాటులో లేదు.

## కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వార్షికోత్సవం

**జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్రావు**




**మొయినాబాద్ , విశాలభారతి:** మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్రావు సూచించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూ పరిధిలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సత్యనారాయణ రెడ్డి వార్షిక నివేదికను ప్రవేశపెట్టి, విద్యార్థుల ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధాన అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ, ప్రపంచంలో సాంకేతిక విప్లవం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యవసరమని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు పొందాలంటే నైపుణ్యం కీలకమని, కేవలం ఉద్యోగాల కోసం కాకుండా ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని సూచించారు. ప్రతి ఏడాది లక్షలాది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్న నేపథ్యంలో అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కాదని, సాంకేతిక పరిజ్ఞానంతో స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల మాట్లాడుతూ, విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేళాల ద్వారా పలువురు విద్యార్థులు విదేశాల్లో ఉద్యోగాలు సంపాదించి మంచి వేతనాలు పొందుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, బంగారు పతకాలు అందజేయగా, ఉత్తమ సేవలు అందించిన అధ్యాపకులను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

## లోక్‌సభ స్థానాలు పెంచే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నాము

**బొబ్బిలి రామకృష్ణ**



**నిజామాబాద్, విశాలభారతి:** చభారత జాతీయ కాంగ్రెస్ "మహిళా వ్యతిరేక" పార్టీ అని, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుందని బీజేపీ ఒక అసత్య మరియు దురుద్దేశపూరిత ప్రచారాన్ని సాగిస్తోంది. ఇది భారతదేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో చెప్పబడుతున్న ఒక పచ్చి అబద్ధం. వాస్తవానికి, మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు 2023లోనే ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇప్పుడు లోక్‌సభలో విఫలమైంది ఏమిటంటే— మహిళా రిజర్వేషన్ల ముసుగులో, దేశ వ్యాప్తంగా పార్లమెంటు మరియు రాష్ట్ర శాసన సభల స్థానాల సంఖ్యను పెంచడానికి, నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్ ) చేపట్టడానికి చేసిన ప్రయత్నమే అయినటువంటి 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు'. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పార్లమెంటు మరియు శాసన సభలలో ఉన్న స్థానాల సంఖ్య ఆధారంగానే, మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ గట్టిగా డిమాండ్ చేస్తోంది. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రయత్నాలను మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము; ఇటువంటి చర్యలు చిన్న రాష్ట్రాలను తీవ్రమైన ప్రతికూలతలోకి నెట్టివేస్తాయి, అంతేకాక దేశ సమాఖ్య స్వరూపాన్ని దెబ్బతీస్తాయి. ఈ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ, ఈ అంశాన్ని కేవలం ప్రచార సాధనంగా వాడుకుంటూ, బీజేపీ తన చీకటి రాజకీయ ఎజెండాను అమలు చేస్తోందని స్పష్టమవుతోంది. ఈ సందర్భంలో, బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టడానికి మరియు వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికి, కాంగ్రెస్ పార్టీ ముందు ఉంటుంది. ఈ నిజాన్ని భారతదేశ మహిళలకు చేరేలా మనందరి క్రియాశీల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకం. మహిళా సాధికారత, లింగ సమానత్వం, మరియు ప్రజాస్వామ్య అత్యున్నత సంస్థలలో మహిళలకు వారి సముచిత వాటా లభించడం పట్ల కాంగ్రెస్ పార్టీ తన అచంచలమైన నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేషన్ డీసీసీ కార్యదర్శులు ఉప్పరి స్వప్న, మడుపు స్వప్న, మాజీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగడం సుమన్, మాజీ కార్పొరేటర్ మురళి, జెండాగుడి చైర్మన్ లవంగ ప్రమోద్, హమాల్వాడి సంతోషీమాత సాయిబాబా గుడి చైర్మన్ గంగాకిషన్, NSUI నాయకులు అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

## డా. సల్ల సౌజన్యకు అగ్రి విద్యార్థుల ఘన స్వాగతం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** చట్ట సభల్లో బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా జరిగిన పోరాటంలో చురుకుగా పాల్గొని, తమ గొంతును దేశవ్యాప్తంగా వినిపించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సల్ల సౌజన్య గారు తెలంగాణకు తిరిగి రావడంతో, అగ్రి యూనివర్సిటీ బీసీ విద్యార్థుల బృందం ఘన స్వాగతం పలికి ఆమెను సన్మానించింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, బీసీ మహిళల రాజకీయ హక్కులు, సముచిత ప్రతినిధిత్వం కోసం డాక్టర్ సౌజన్య గారు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అంకితభావం మరియు పోరాట స్ఫూర్తి ప్రతి యువతకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల మహిళలకు న్యాయం చేయాలన్న సంకల్పంతో ఆమె చేసిన ఉద్యమం ప్రశంసనీయమని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ఈ పోరాటం ద్వారా బీసీ మహిళల సమస్యలు జాతీయ స్థాయిలో చర్చకు వచ్చాయని, ఇటువంటి ఉద్యమాలు భవిష్యత్తులో మరింత బలపడాలని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలకు సముచిత రాజకీయ అవకాశాలు కల్పించడం సమాజ సమానత్వానికి దారి తీస్తుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పూర్వ వ్యవసాయ విద్యార్థి మరియు యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరి ప్రసాద్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మరియు ఏఐపీసీ అగ్రి ప్రొఫెషనల్స్ మాజీ డిప్యూటీ హెడ్ యంగలి గోపి గౌడ్, యూనివర్సిటీ అధ్యక్షుడు రాజ్ కుమార్, బీసీ విద్యార్థి నాయకులు పవన్, కిషోర్, సన్నిత్, మోహన్, గణేష్ రవీందర్ తదితరులు పాల్గొని డాక్టర్ సౌజన్య గారికి తమ మద్దతు తెలియజేశారు. చివరగా, బీసీ మహిళల హక్కుల కోసం ఇలాంటి పోరాటాలు మరింత విస్తరించాలని, యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## విదేశీ ఉద్యోగాలకు మైనారిటీలు దరఖాస్తు చేసుకోండి

**మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యండి. యాకుబ్ పాషా**



**కొత్తగూడెం, విశాలభారతి:** రాష్ట్రంలోని మైనారిటీ నిరుద్యోగ యువత, విదేశీ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యండి. యాకుబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ (టి.ఓ.ఎం.కాం) ఆధ్వర్యంలో గల్ఫ్ తో పాటు ఇతర దేశాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఖతార్, దోహా, గ్రీస్ , సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూ.ఏ.ఈ) వంటి దేశాల్లో నర్సింగ్, టెక్నికల్, డ్రైవింగ్, హాస్పిటల్ స్టాఫ్ విభాగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, జీఎన్ ఎం/ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణత కలిగి అనుభవం కలిగిన వారికి అవకాశం ఉంటుందని అన్నారు. పైన తెలుపబడిన ఉద్యోగాలకు అభ్యర్థులలో ఎంపికైన వారికి ఆకర్షణీయమైన వేతనంతో పాటు ఉచిత వసతి, మెడికల్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు కల్పించబడతాయని వివరించారు. నర్సింగ్ జి.ఎన్.ఎం, బి.ఎస్సి, ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, డ్రైవర్, హాస్పిటల్ సపోర్ట్ స్టాఫ్ వంటి ఉద్యోగాలకు డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసే అభ్యర్థుల వయస్సు సాధారణంగా 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, కొన్ని టెక్నికల్ పోస్టులకు గరిష్ట వయస్సు 40 సంవత్సరాల వరకు సడలింపు ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన మైనారిటీ యువత వెంటనే తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు సిద్ధం చేసుకుని tomcomglobal@gmail.com, tomcomresume@gmail.com ఈమెయిల్‌లకు పంపించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8520860785 నంబర్లను సంప్రదించాలని యండి. యాకూబ్ పాషా తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను మైనారిటీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సింగరేణి మాజీ కార్మికుల ఔదార్యం స్ఫూర్తిదాయకం

- **మణుగూరు ఏరియా జిఎం దుర్గం రాంచందర్ ప్రశంస**
- **సింగరేణి మాజీ కార్మికులు చింతల కొమరయ్య, కొడుకులు సత్యనారాయణ ల ఔదార్యం**
- **రెండున్నర క్వింటాళ్ల బియ్యం, నిత్యాసర వస్తువులు, సహ పంక్తి భోజనాలు**



**మణుగూరు, విశాలభారతి :** సింగరేణి మాజీ కార్మికుల ఔదార్యం స్ఫూర్తిదాయకం అని మణుగూరు ఏరియా జిఎం దుర్గం రామచందర్ ప్రశంసించారు, ఆదివారం నాడు సంతోషనగర్ శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో జరిగిన మణుగూరు ఏరియా మాజీ సింగరేణి కార్మికులు చింతల కొమరయ్య, రెండు క్వింటాళ్ల బియ్యం నిత్యవసర వస్తువులు,కొడుకుల సత్యనారాయణ (అనకాపల్లి) యాభై కిలోల బియ్యం సహ పంక్తి భోజనాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో సామాజిక కార్యక్రమాలు అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు, చెవిటి మూగ పాఠశాలలు, సమీప గ్రామాల్లో నిరుపేదలకు సహాయ సహకారాలు ఇలా ప్రతి కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగుల ఆర్థిక సహకారంతో కూడుకున్న ముద్ర ఉంటుందని అన్నారు. మణుగూరు ఏరియాకు గర్వకారణం అని ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో అభినందనీయమని ఆయన ప్రశంసించారు, చదువు బ్రతుక్కి బాట చూపటం తో పాటు, జీవితంలో క్రమశిక్షణతో ఎలా నడుచుకోవాలో నేర్పుతుందన్నారు, విద్యతోనే వికాసం అని దాతల సహకారంతో విద్యార్థులు ఉన్నత శిఖరాల అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు, వేసవి సెలవుల్లో నదులు, చెరువులు కుంటల వద్దకు వెళ్ళవద్దని నైపుణ్యత కలిగిన వారి సహకారంతో మాత్రమే ఈత శిక్షణ పొందాలని సూచించారు, ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు,అనంతరం చిన్నారులకు బిస్కెట్లు అందజేశారు, ఎంతోమంది అనాధలు ఆదివాసీలు నిరుపేద విద్యార్థుల భవితకు పాటుపడుతున్న పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాతలు చింతల కొమరయ్య కొడుకుల సత్యనారాయణ, సర్వే ఆఫీసర్ షేక్ సర్వర్ నబి, లతో పాటు కార్యక్రమం సమన్వయకర్త సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా, అంగోత్ మంగీలాల్, పి జాన్,పాఠశాల నిర్వాహకులు బి జగన్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బానోత్ సతీష్ కుటుంబానికి తోడుగా

- **బంచరాయితండ హెల్పింగ్ హ్యాండ్స్**
- **సతీష్ కుటుంబానికి రూ.20,000 ఆర్థిక సాయం.**



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బానోత్ సతీష్ (తండ్రి బిక్కు) వడదెబ్బకు గురై మృతి చెందడంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ కష్టసమయంలో గ్రామంలోని "హెల్పింగ్ హ్యాండ్స్" సేవా బృందం ముందుకు వచ్చి మానవతా విలువలను చాటుకుంది. హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో సతీష్ కుటుంబానికి రూ.20,000లను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, ఏప్రిల్ 11 రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. ప్రతిరోజూ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న సతీష్, ఆ రోజు కూడా సాధారణంగానే పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. అయితే రాత్రి అకస్మాత్తుగా అస్వస్థతకు గురై వాంతులు, విరోచనాలతో బాధపడుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని వివరించారు. సతీష్‌కు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబం పూర్తిగా అతని ఆదాయంపై ఆధారపడి ఉండటంతో, అతని మరణం వారి జీవనాధారాన్ని కుదిపేసింది. ఈ నేపథ్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ సభ్యులు స్పందించి వెంటనే సహాయం అందించడం గ్రామ ప్రజల ప్రశంసలను అందుకుంది. గత 7 సంవత్సరాలుగా ఈ హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూప్ నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందించడం, పేద కుటుంబాల్లో మరణాలు సంభవించినప్పుడు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. "ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా ఎవరికైనా కష్టం వస్తే ముందుండి సహాయం అందిస్తాం" అని గ్రూప్ సభ్యులు స్పష్టం చేశారు. బంచరాయితండలోని నిరుపేద కుటుంబాలకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలబడటం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగడం సమాజంలో సహానుభూతి, పరస్పర సహకార భావనలను మరింత బలపరుస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# న్యూ ఢిల్లీలో మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**మహిళా బిల్లు, డిలిమిటేషన్, దక్షిణాది రాష్ట్రాలపై అన్యాయం అంశాలపై చర్చ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** దేశ రాజధాని న్యూ ఢిల్లీ లో నిర్వహించిన ముఖ్యమైన మీడియా సమావేశంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. దేశ రాజకీయాల్లో ప్రాధాన్యత పొందిన ఈ సమావేశంలో పార్లమెంట్‌లో పెండింగ్‌లో ఉన్న మహిళా బిల్లు, రాబోయే డిలిమిటేషన్ ప్రక్రియ, అలాగే దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.సమావేశంలో పాల్గొన్న నాయకులు రాష్ట్రాల మధ్య సమానత్వం, జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం, మరియు దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణ అవసరాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా డిలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకూడదని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే విషయంలో తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల మధ్య సమతుల్యతను పాటించేలా నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుత జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ మీడియా సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

## రైతు సోదరులకు వ్యవసాయ శాఖ పిలుపు



**మరిపెడ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, యాసంగి 202526 రెండవ విడత రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం నిర్వహించనున్నట్లు వెల్లడించింది.భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్పల్లి గ్రామంలో జరిగే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా లైవ్ టెలికాస్ట్ ద్వారా ప్రసారం చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులకు అమూల్య సందేశం అందించనున్నారు.ఈ కార్యక్రమాన్ని మరిపెడ మండలంలోని ధర్మారం రైతు వేదికలో రేపు (ఏప్రిల్ 20) సాయంత్రం 5 గంటలకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి భూక్య వీరాసింగ్ తెలిపారు.అందువల్ల గౌరవ ప్రజా ప్రతినిధులు, రైతు సోదరులు, మహిళా రైతులు, రైతు సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని తిలకించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఎంఈఓ ను బెదిరించిన బాలయేసు పాఠశాల కరెస్పాండెంట్



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రంలో ఉన్న బాలయేసు ప్రయివేట్ పాఠశాలలో ఆదివారం కూడా క్లాసులు నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల నుండి దేవరుప్పుల మండల విద్యాశాఖ అధికారి జి. కళావతికి ఫిర్యాదు రాగా ఈరోజు వెరిఫికేషన్ కొరకు బాలయేసు పాఠశాలకు వెళ్లారు.రామకృష్ణ అనే ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠం చెబుతూ ఉండగా తరగతి గదిలోకి వెళ్లిన కళావతి విద్యార్థులతో మాట్లాడుతున్నారు.అదే సమయంలో పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు తరగతి గదిలోకి వచ్చి విద్యార్థులు 'మీరెవరూ ఈమెతో మాట్లాడవద్దని,వెంటనే వెళ్లిపోండని..'పిల్లలను పంపించి 'నువ్వు ఎవరు ఇక్కడికి రావడానికి?ఇది నా ఇల్లు..నా ఇష్టం..'అంటూ దాడికి ప్రయత్నించారు.సిఆర్పి యాకస్వామి అడ్డుకో పోగా 'నీకు మేడం..నాకు కాదు..'అంటూ దుర్భషలాడాడు.ఫొటోస్ తీస్తున్న సిఆర్పి చేతి నుండి ఫోన్ లాక్కున్నారు.ఎస్సై గారికి ఫోన్ చేయమని కళావతి సిఆర్పికి చెప్పగా నా ఫోన్ లాక్కొని పగలగొట్టే ప్రయత్నం చేశారు.'నువ్వు ఒక లేడీవా?' అంటూ అసభ్యంగా మాట్లాడాడు.'నీ సంగతి చెబుతాను..'అంటూ బెదిరించారు.అక్కడినుండి స్థానిక పోలీస్ స్టేషన్ కు వెళ్ళిన ఎంఈఓ కళావతి 'ప్రభుత్వ అధికారి నైనా నన్ను విధులు ఆటంకపరిచి దుర్భషలాడి బెదిరించిన బాలయేసు స్కూల్ కరస్పాండెంట్ జేసురాజుపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని' ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఊర సృజన్ కుమార్ తెలిపారు.

## నేడే రెండో విడత రైతు భరోసా



**విశాలాభారతి :** కొత్తగూడ వ్యవసాయ అధికారి జక్కుల ఉదయ్ రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా పథకం కింద అందించే రెండో విడత ఆర్థిక సహాయాన్ని నేడు ఏప్రిల్ 20 సోమవారం ప్రభుత్వం విడుదల చేయనుందనీ వ్యవసాయ అధికారిఉదయ్ తెలిపారు.భూపాలపల్లి జిల్లా కాటారం వేదికగా నాస్తూర్‌పల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రుల సమక్షంలో ఈ నిధులను అధికారికంగా విడుదల చేయనున్నారు.మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నిరైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నాట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి రైతులు, అన్నిగ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అనుబంధ శాఖల అధికారులు హాజరుకావాలని మండల వ్యవసాయ అధికారి జక్కుల ఉదయ్ తెలియజేసారు.

## మహిళా 33శాతం రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేక ఓటుపై ఆగ్రహం



**ఆలేరు,విశాలభారతి:** దేశ మహిళల గౌరవం, హక్కుల కోసం తీసుకొచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఇండి కూటమి (కాంగ్రెస్) ఓటు వేసిందని ఆరోపిస్తూ పార్టీ శ్రేణులుఆలేరు రైల్వే గేటు వద్ద ఘాటుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే చారిత్రాత్మక బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం దురుద్దేశపూరిత చర్య అని ఆరోపించారు. మహిళా శక్తిని గౌరవిస్తూ సమాన హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. నినాదాలు చేస్తూ మహిళల హక్కులకు విఘాతం కలిగించే చర్యలను ఖండించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నందగంగేష్, జనరల్ సెక్రెటరీ సుంకరి సృజన్ కుమార్ గౌడ్, జిల్లా సెక్రెటరీ కామిటికారి కృష్ణ, సీనియర్ నాయకులు చిరిగె శ్రీనివాస్, ఐడియా శ్రీనివాస్, తోట మల్లయ్య, మల్రెడ్డి నరసింహారెడ్డి, తోట వెంకటయ్య, గుర్రం నరసింహులు, పట్టణ ఉపాధ్యక్షుడు సుక్కరాజు, జూకంటి సంపత్, సబ్బని సుభాష్, పపూల హనుమంతు, బైరి మహేందర్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే చారిత్రాత్మక బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడం దురుద్దేశపూరిత చర్య అని ఆరోపించారు. మహిళా శక్తిని గౌరవిస్తూ సమాన హక్కులు కల్పించాలనే డిమాండ్‌తో ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు.

## కారు మేళాకు విశేష స్పందన




**ముషీరాబాద్,విశాల భారతి:** నాచారం లోని కారు మేళా"కు అనూహ్య స్పందన లభిస్తుంది. కార్ల ప్రదర్శన మేళాకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది కస్టమర్లు హాజరయ్యారని ట్రస్ట్ కార్స్ నిర్వాహకులు రోషన్ తెలిపారు. ప్రతి ఆదివారం, గురువారం కార్ మేళా ను నిర్వహిస్తున్నామని చెప్పారు.చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయి వరకు తమ వద్ద సెకండ్ హ్యాండ్ కార్లు అందుబాటు లో ఉన్నాయని, అతి తక్కువలో సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా 50వేలకు కారు అందిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి ఒక కారు అనే నినాదం తమ ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఆదివారం, గురువారం నిర్వహించే కారు మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9666127703 సంప్రదించాలని ట్రస్ట్ కార్స్ నిర్వాహకులు రోషన్ తెలిపారు.


## క్రికెట్లో అద్భుతంగా రాణిస్తున్న వరికుప్పల వెంకట్



**ముషీరాబాద్,విశాలభారతి:** క్రికెట్ పై మక్కువ పెంచుకొని క్రికెట్లో రాణించాలని వరికుప్పల వెంకట్ చిన్న వయసు నుండే క్రికెట్ ఆట మొదలుపెట్టాడు. తండ్రి వరికుప్పల శ్యామ్ సహకారంతో ప్రతిరోజు ఉదయమే ఓపెన్ గ్రౌండ్స్, క్రికెట్ స్టేడియాలకు వెళ్లి ప్రాక్టీస్ చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల చెంగిచెర్లలో సికింద్రాబాద్ బజరంగ్ టీం వర్సెస్ వడ్డెర బస్తి క్రికెట్ టీం తరపున క్రికెట్ ఆడి తన ప్రతిభను చాటుకున్నారు. అత్యధిక పరుగులు చేసి వడ్డెర బస్తీ క్రికెట్ టీం కు కప్పు అందే విధంగా టీం క్రీడాకారులతో వెంకట్ అద్భుతంగా ఆడారు. స్నేహితులు బంధువులు మిత్రులు క్రికెట్లో అద్భుతంగా రాణిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రస్థాయిలో రాణించడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలని శ్యామ్ విజ్ఞప్తి చేశారు.

## అర్ధరాత్రి చోరీ కలకలం

- **రంగనాయక స్వామి ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు అపహరణ**
- **జియో ట్యాగింగ్‌తో ఆలయ భద్రత కట్టుదిట్టం – నిందితుల కోసం ప్రత్యేక బృందాల వేట**




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:** తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించి దేవాలయంలో చోరీకి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. తొర్రూర్ నుండి బ్రాహ్మణపల్లి వెళ్లే మార్గంలో శివారు ప్రాంతంలో ఉన్న శ్రీ రంగనాయక స్వామి టెంపుల్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటన వివరాల్లోకి వెళ్తే... శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని దుండగులు ఆలయానికి చేరుకుని ప్రధాన ద్వారం తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం గర్భాలయం సమీపంలో ఉన్న హుండీని పగులగొట్టి, అందులో భక్తులు సమర్పించిన నగదు, కానుకలను అపహరించి పరారయ్యారు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకులు తాళాలు విరగ్గొట్టబడి ఉండటాన్ని గమనించి స్థానికులతో కలిసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్లూస్ టీమ్ సహాయంతో కీలక ఆధారాలు సేకరించారు.పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆలయాన్ని జియో ట్యాగ్ చేశారు. అదేవిధంగా ఆలయ భద్రత పర్యవేక్షణ కోసం ఎలక్ట్రానిక్ పాయింట్ బుక్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా రాత్రిపూట గస్తీ తిరిగే పోలీసులు తమ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న దేవాలయాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని పోలీసులు తెలిపారు. భక్తులు, స్థానికులు ఆందోళన చెందవద్దని, త్వరలోనే నిందితులను పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు భరోసా ఇచ్చారు.

## పోచమ్మ పండుగలో భక్తి వెల్లువ నిమ్మ నగర్‌లో ప్రముఖుల సందడి



**మోటకొండూర్, విశాలభారతి :** మోటకొండూరు మండలం అబిద్ నగర్ గ్రామపంచాయతీలోని (నిమ్మ నగర్)లో ఈరోజు పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు మాజీ ఎమ్మెల్యేలు బూడిద బిక్షమయ్య గౌడ్, గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి, మదర్ డైరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి, మాజీ ఎంపీపీ పైళ్ల ఇందిరా సత్యనారాయణ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొట్ల యాదయ్య హాజరయ్యారు.పండుగ సందర్భంగా గ్రామంలో భక్తి భావం వెల్లివిరిసింది. గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సమాజ శాంతి, సౌభాగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. అలాగే అబిద్ నగర్, అమ్మనబోలు సర్పంచులు నాయిని అమరావతి రామచంద్ర రెడ్డి, మామిడాల నర్సమ్మ మల్లయ్య, ఉపసర్పంచులు సైరెడ్డి కృష్ణారెడ్డి, కోల కృష్ణ, వార్డు సభ్యులు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్లు బీస కృష్ణంరాజు, పన్నాల నర్సిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బీస బిక్షపతి, సామజాన్ రెడ్డి, బబ్బూరి సత్యనారాయణ, సామ రవీందర్ రెడ్డి, సిద్ధారెడ్డి, సాయి రెడ్డి మహేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, కాసుల లవన్ రెడ్డి, ఎగమాటి వేణు రెడ్డి, సంగు శ్రీనివాసరెడ్డి, శిగ సాయికుమార్, జంగారెడ్డి ఎగ్గిడి కృష్ణ, కాదూరి ఎల్లెందర్, బొట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు ప్రాణ రక్షణ కిట్లపై శిక్షణ



**దేవరుప్పుల విశాలభారతి:** మండలంలో గీత కార్మికుల భద్రత కోసం ముఖ్యమైన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ రావు ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ బాల్నె వెంకట మల్లయ్య సమక్షంలో సీతారాంపురం కడవెండి, రాంభోజీ గూడెం, గ్రామాలకు చెందిన గీథ కార్మికులకు కాటమయ్య సంస్థ సేఫ్టీ కిట్ల వినియోగం పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘ అధికారులు మాట్లాడుతూ, భువిపై ఉన్న వ్యక్తులలో ప్రమాదకరమైన వృత్తి కళ్ళు గీస్తున్న గౌడ్అన్న వృత్తి అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే సుమారు ఉదయం మంది గీత కార్మికులకు సేఫ్టీకిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి గీత కార్మికుడు ఈ కిట్లను తప్పనిసరిగా ఉపయోగించుకుని తమ ప్రాణాలు కాపాడుకొని కుటుంబ బాధ్యత పోషించడానికి బాధ్యతగా ఈ కిట్టును ఉపయోగించుకోవాలి అని వీటి వినియోగంతో ప్రమాదాలకు ఘననియంగా తగ్గించవచ్చని సూచించారు. అలాగే రాంబోజిగూడెం ఒక గీత కార్మికుని కుటుంబ సభ్యులు కూడా మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, ఇవి ప్రమాలను నివారించడంలో సహాయపడుతున్నాయని తెలిపారు. ప్రతి కార్మికుడి ఈ కిట్లను ఉపయోగించి తమ కుటుంబాన్ని రక్షించుకోవాలిని, కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరిధుల ధనలక్ష్మీ భాస్కర్ గౌడ్, ట్రైనర్లు వడ్లకొండ వెంకటేష్, మోలుగురి సంతోష్ కుమార్, టిసిఎస్ అధ్యక్షులు గుర్రం రామచంద్రుని, పంతం రవి, పెద్ది రవీందర్, బసవ సోమయ్య, రాంపల్లి యాదగిరి, రాంపల్లి మల్లేష్, గైని శీను, మొలుగురి భాస్కర్, మొలుగూరు నరసయ్య, గైనీ సోమయ్య, మొలుగురు అంజయ్య, గుర్రం అశోక్, బండి నవీన్, పరీధుల శశి, ఉప్పునూతల స్వరూప, గైని పద్మ, గిలకత్తుల సోమలక్ష్మి, ఆశ గాని సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## కారు ఢీకొని ఒకరు మృతి ముగ్గురికి గాయాలు





**మోత్కూరు,విశాలభారతి:** మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు _ బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, ఎర్ర కాల్వకు చెందిన ముక్కెర చంద్రయ్య నే వృద్ధుడు పాలడుగు గ్రామానికి ఓ పని నిమిత్తం పై వచ్చి తిరిగి సర్వీస్ రోడ్ నుంచి ఎర్రకాల్వకు వెళ్లేందుకు బైక్ పై అవతల వైపు సర్వీస్ రోడ్డుకు వెళ్తున్న సమయంలో, వలిగొండ రోడ్డు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు TS08JP1230 బైక్‌ను ఢీకొట్టింది. అనంతరం కారు అదుపుతప్పి పక్కనే వెళ్తున్న ఆటోను కూడా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బైక్ పై. వెళ్తున్న వలిగొండ మండలం ఎర్రకాల్వ గ్రామానికి చెందిన చంద్రయ్య సంఘటన స్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటనలో మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది అక్కడికి చేరుకొని గాయపడిన క్షతగాత్రులను ప్రాథమిక వైద్యం అందించి అంబులెన్స్‌లో వెంటనే మోత్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఈ.ఎం.టి తొంట భాస్కర్ ,పైలెట్ లాదినేని సోమేశ్వర్ తెలిపారు.ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు చంద్రయ్య సోదరుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సి. వెంకటేశ్వర్లు తెలిపారు.


## చౌటుప్పల్లో ఎలివేటెడ్ కారిడార్ డిమాండ్‌తో బీఆర్ఎస్ ధర్నా




**యాదాద్రి భువనగిరి,విశాలభారతి:** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై మట్టి కట్ట నిర్మాణానికి వ్యతిరేకంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొంటూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఎదుట ఉన్న మట్టి కట్టను తొలగించి అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ ర్యాలీ చేపట్టారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనతో కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చింతల దామోదరరెడ్డి, వెంకటరెడ్డి, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రతలు పెరుగుతున్న వేళ జాగ్రత్తలు పాటించాలి

**డాక్టర్ గుగులోత్ రవి నాయక్**



**మరిపెడ, విశాలభారతి:** వేసవి కాలంలో రోజురోజుకు ఎండ తీవ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మరిపెడ మండల వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో నిర్వహించిన ఇంటర్వ్యూలో పలు సూచనలు వెల్లడించారు.

**ప్రశ్న: ఎండ తీవ్రతల సమయంలో ప్రజలు ఎలా జాగ్రత్త పడాలి?**

సమాధానం: ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండటం మంచిది. అవసరమైతే తలకు టోపీ లేదా గుడ్డ కప్పుకోవాలి. రోజుకు ఎక్కువగా నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవాలు తీసుకోవాలి.

**ప్రశ్న: హీట్ స్ట్రోక్ లక్షణాలు ఏమిటి?**

సమాధానం: అధిక చెమటలు, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

**ప్రశ్న: చిన్నపిల్లలు, వృద్ధులు ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?**

సమాధానం: వీరిని ఎండలో ఎక్కువసేపు ఉండనివ్వకూడదు. తరచుగా నీరు ఇవ్వాలి. తేలికపాటి ఆహారం ఇవ్వడం అవసరం.

**ప్రశ్న: ప్రజలకు మీ సూచన?**

సమాధానం: ఎండ ప్రభావాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి. ఏవైనా అసౌకర్యం కలిగితే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలి.ప్రజలు వైద్యాధికారుల సూచనలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రారంభించిన ఉబ్బు వెంకటయ్య మార్కెట్ కమిటీ చైర్మన్**



**చౌటుప్పల్ విశాలభారతి:** మండలంలోని లింగోజిగూడెం, అంకిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గల ధాన్యం కొనుగోలు సెంటర్లను ప్రారంభించిన చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మరియు అంకిరెడ్డి గూడెం గ్రామ సర్పంచ్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు సురవి మల్లేష్ గౌడ్.అనంతరం వారు మాట్లాడుతూ... ఏ సందర్భంలోనైనా అకాల వర్షం పడే అవకాశం ఉన్నందని కావున రైతులు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు ఎవరు అధైర్య పడద్దని రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ ప్రభుత్వమే కొంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆకుల ఇంద్రసేనారెడ్డి మార్కెట్ కమిటి వైస్ చైర్మన్, లావణ్య సురేందర్ రెడ్డి కౌన్సిలర్, అధికారులు ఏ ఓ నాగరాజు,జి పి ఓ రాములు,చెన్నగోని అంజయ్య గౌడ్,మాజీ సింగల్ విండో వైస్ చైర్మన్,గ్రామ ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, రైతులు, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

**అగ్నిమాపక అధికారి డాక్టర్ కే బాబు**



**కోదాడ, విశాలభారతి:** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గుడిబండ రోడ్డులో గల డీమార్ట్ నందు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు జరిగినపుడు ఎలా ఆర్పాలో తగు జాగ్రత్తలు గురించి అగ్నిమాపక అధికారి డాక్టర్ కే బాబు డీ మార్ట్ సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు మీరు ఉద్యోగాలు చేస్తున్న ప్రాంతాల్లోనే జరిగినప్పుడు కాకుండా మీరు నివాసం ఉంటున్న గ్రామాలలో జరిగినప్పుడు మీరు ఆ ప్రమాదాన్ని నివారించడానికి కూడా సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిమార్ట్ మేనేజ్మెంట్, ఫైర్ సిబ్బంది ఎం శ్రీనివాస్, లీడింగ్ ఫైర్ ఫైటర్ డి ప్రకాష్, ఫైర్ ఫైటర్ జి శ్రీనివాసరావు, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా నీటి దానం గొప్పది

**ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ**




**శేరిలింగంపల్లి, విశాలభారతి:** టీఎన్జీవోఎస్ కాలనీలో నూతన చలివేంద్రాన్ని శాసన మండలి తొలి చైర్మన్ స్వామి గౌడ్, డీసీ సేవా ఇస్లావత్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించి కాలనీ వాసులకు, బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వేసవిలో ప్రజల దాహాన్ని తీర్చే చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ఇవి బాటసారులు, వాహనదారులకు ఎంతగానో ఉపయోగపడతాయి. అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి" అని పిలుపునిచ్చారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులు మారేళ్ల శ్రీనివాసరావును గాంధీ అభినందించారు.

*భాగ్యనగర రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు ఒక సరికొత్త శిఖరాన్ని అధిరోహిస్తోంది. 2026 నుంచి 2031 వరకు సాగే ఈ ఐదేళ్ల కాలచక్రం హైదరాబాద్ రూపురేఖలను సమూలంగా మార్చబోతోంది. సాధారణ మధ్యతరగతి ఇళ్ల నుంచి కోట్లాది రూపాయల విలువైన అల్ట్రా-లగ్జరీ నివాసాల వరకు మార్కెట్ అనూహ్యమైన వృద్ధిని నమోదు చేస్తోంది. ముఖ్యంగా 'గ్రేడ్-ఏ' డెవలపర్ల ఆధిపత్యం, పశ్చిమ హైదరాబాద్‌లోని నియోపోలిస్ వంటి ప్రాంతాల విరామం లేని వృద్ధి రియల్ రంగానికి కొత్త ఊపిరిని పోస్తున్నాయి.*

*- విశాలభారతి, హైదరాబాద్*



# సిటీ రియాల్టీలో... గ్రేడ్-ఏ దిగ్గజాల దూకుడు

## 2026-2031 వృద్ధిపై 'క్రీమ్యాట్రిక్స్' విశ్లేషణ

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు కేవలం స్థానిక అవసరాలకే పరిమితం కాలేదు. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో కూడిన ప్రాజెక్టులు ఇక్కడ రూపుదిద్దుకుంటున్నాయి. తాజా 'క్రీ మ్యాట్రిక్స్' నివేదిక ప్రకారం, రాబోయే ఐదేళ్లలో మార్కెట్‌ను శాసించబోయే మొదటి ఐదు డెవలపర్ల వివరాలు, మార్కెట్ పోకడలను పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**అగ్రస్థానంలో 'మై హోమ్'.. వెన్నంటే 'రాజపుష్ప'**

హైదరాబాద్ మార్కెట్లో 'మై హోమ్ గ్రూప్' తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. రాబోయే కాలంలో సుమారు 22.07 మిలియన్ చదరపు అడుగుల సరఫరాను (Supply) ఈ సంస్థ ఒక్కటే తీసుకురాబోతోంది. దీని సంభావ్య విక్రయ విలువ రూ.31,292 కోట్లుగా అంచనా వేయబడింది. మై హోమ్ కు గట్టి పోటీనిస్తూ 'రాజపుష్ప ప్రాపర్టీస్' 22.02 మిలియన్ చదరపు అడుగుల సరఫరాతో రూ. 30,767 కోట్ల విలువతో రెండో స్థానంలో నిలిచింది. ఈ రెండు సంస్థలు పశ్చిమ హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాలైన కోకాపేట్, గచ్చిబౌలిలలో భారీ ప్రాజెక్టులను నిర్మిస్తున్నాయి.

**స్థిరమైన వృద్ధిలో అపర్ణ, ప్రెస్టీజ్....**

అపర్ణ కన్స్ట్రక్షన్స్ సుమారు 20.23 మిలియన్ చదరపు అడుగుల సరఫరా, రూ.28,050 కోట్ల విలువతో టాప్-3లో నిలిచింది. ఇక బెంగళూరు కేంద్రంగా పనిచేసే 'ప్రెస్టీజ్ గ్రూప్' హైదరాబాద్‌లో తన పరిధిని వేగంగా విస్తరిస్తోంది. అధిక వాల్యూమ్, హై-ఎండ్ సేల్స్ లో ఈ సంస్థ ముందంజలో ఉంది. వీటితో పాటు 'వాసవి గ్రూప్' గత ఐదేళ్లుగా విక్రయాల్లో అగ్రగామిగా నిలిచి, భవిష్యత్తు ప్రాజెక్టుల కోసం సిద్ధమవుతోంది.

మార్కెట్ మలుపు: రూ. 5–10 కోట్ల సెగ్మెంట్‌కు క్రేజ్ పెరిగింది. హైదరాబాద్ మార్కెట్లో ఇప్పుడు ధనిక వర్గాల ప్రాధాన్యతలు మారిపోయాయి. ఒకప్పుడు రూ. 1-2 కోట్ల ఫ్లాట్ లగ్జరీగా భావించేవారు, కానీ ఇప్పుడు రూ. 5 నుండి 10 కోట్ల విలువైన అపార్ట్‌మెంట్లు, విల్లాలకు విపరీతమైన గిరాకీ పెరిగింది. 2026 మొదటి త్రైమాసికంలోనే ఈ విభాగంలో 415 యూనిట్లు విక్రయించడం మార్కెట్ బలాన్ని చాటుతోంది. మొత్తం మీద చూస్తే సగటు ఇంటి ధర కూడా గణనీయంగా పెరిగి రూ.1.47 కోట్ల మార్కుకు చేరింది.

**దూసుకుపోతున్న టాప్-10 డెవలపర్లు**

రాబోయే ఐదేళ్లలో టాప్-10 డెవలపర్లు కలిసి సుమారు 133 మిలియన్ చదరపు అడుగుల నిర్మాణాలను మార్కెట్లోకి తీసుకురానున్నారు. ఇది కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాదు, నగర ఆర్థిక వ్యవస్థకు ఒక పెద్ద ఊతం. రాఘవ ఇన్ఫ్రాకాన్, కాండూర్ డెవలపర్స్, సైబర్ సిటీ బిల్డర్స్ మరియు సాత్వి గ్రూప్ వంటి సంస్థలు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో భారీ పెట్టుబడులు పెడుతున్నాయి.

**హాట్ స్పాట్స్: ఎక్కడ చూసినా కోకాపేట్ ముచ్చటే!**

- హైదరాబాద్ పశ్చిమ ప్రాంతం ఇప్పుడు రియల్ ఎస్టేట్ రాజధానిగా మారింది.
- కోకాపేట్ (నియోపోలిస్): ఇక్కడ చదరపు అడుగు ధర రూ.9,000 నుండి రూ.15,000 మధ్య పలుకుతోంది. కొన్ని ప్రీమియం ప్రాజెక్టులలో ఇది రూ.18,000పైగా కూడా దాటుతోంది.
- గచ్చిబౌలి - ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్: ఐటీ ఉద్యోగులు మరియు ప్రవాస భారతీయుల (NRI) మొదటి ఛాయిస్ ఇదే. ఇక్కడ గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్‌తో పాటు విలాసవంతమైన హై-రైజ్ అపార్ట్‌మెంట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి.
- కొండాపూర్ - తెల్లాపూర్: గేటెడ్ కమ్యూనిటీ నివాసాలకు ఈ ప్రాంతాలు అడ్డాగా మారాయి. ఇక్కడ ధరలు చదరపు అడుగుకు రూ.8,700 నుండి రూ.12,700 వరకు ఉన్నాయి.
- లోతైన విశ్లేషణ:
- కొనుగోలుదారులు ఎటు వైపు నిపుణుల విశ్లేషణ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్ ఇప్పుడు ఇన్వెస్టర్ మార్కెట్ నుంచి ఎండ్-యూజర్ మార్కెట్ గా మారుతోంది. అంటే కేవలం లాభాల కోసం కొనేవారి కంటే, సొంత నివాసం కోసం వెతికేవారే ఎక్కువగా ఉన్నారు.
- హై-రైజ్ వర్సెస్ విల్లా: విల్లాలకు ఉన్న క్రేజ్ తగ్గలేదు కానీ, మెయింటెనెన్స్, భద్రత దృష్ట్యా నియోపోలిస్ వంటి ప్రాంతాల్లో వస్తున్న 'స్కై స్క్రాపర్స్' (ఆకాశ హర్మ్యాల) వైపు ధనవంతులు మొగ్గు చూపుతున్నారు.
- అమెనిటీస్: కేవలం క్లబ్ హౌస్ ఉంటే సరిపోదు. ఇప్పుడు ఇండోర్ గోల్ఫ్, ప్రైవేట్ థియేటర్లు, సెంట్రల్ ఎయిర్ కండిషనింగ్, ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ పాయింట్లు ప్రాథమిక అవసరాలుగా మారిపోయాయి.

**పెరుగుతున్న ఖర్చులు:**

స్టీల్, సిమెంట్ ధరలు పెరిగినప్పటికీ, నాణ్యత విషయంలో రాజీ పడని 'గ్రేడ్-ఏ' బిల్డర్ల ప్రాజెక్టులకే వినియోగదారులు ప్రాధాన్యత ఇస్తున్నారు.

**నిపుణుల సలహా**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ 2026లో ఒక స్థిరీకరణ దశకు చేరుకుంది. 2019 నుంచి ధరలు 81% పెరిగినా, డిమాండ్ తగ్గకపోవడం గమనార్హం. కొత్తగా ఇల్లు కొనాలనుకునే వారు 2026-27ను సరైన సమయంగా భావించవచ్చు, ఎందుకంటే మెట్రో రెండో దశ, నియోపోలిస్ పూర్తి స్థాయి అభివృద్ధి తర్వాత ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరే అవకాశం ఉంది.

మొత్తానికి, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఆకాశమే హద్దుగా ఎదుగుతోంది. మై హోమ్, రాజపుష్ప వంటి దిగ్గజాలు నగర రూపురేఖలను మారుస్తుంటే, కోకాపేట్ వంటి ప్రాంతాలు గ్లోబల్ సిటీలకు దీటుగా నిలుస్తున్నాయి. విలాసవంతమైన జీవితాన్ని గడపాలనుకునే వారికి, దీర్ఘకాలిక పెట్టుబడి కోసం చూసేవారికి భాగ్యనగరం ఇప్పుడు బంగారు గనిలా మారింది.

## టాప్ 10 డెవలపర్ల వాటా ఇదే..

- మై హోమ్ గ్రూప్ (My Home Group): 5.0% వాటాతో మార్కెట్‌లో అగ్రస్థానంలో నిలిచింది. సుమారు 22.07 మిలియన్ చదరపు అడుగుల రెరా (RERA) రిజిస్టర్డ్ విస్తీర్ణంతో, రూ. 31,292 కోట్ల సంభావ్య విలువ కలిగిన ప్రాజెక్టులతో దూసుకుపోతోంది.
- రాజపుష్ప ప్రాపర్టీస్ (Rajapushpa Properties): 4.9% వాటాతో మై హోమ్‌కు గట్టి పోటీనిస్తోంది. 22.02 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణం మరియు రూ. 30,767 కోట్ల విలువతో రెండో స్థానంలో నిలిచింది.
- అపర్ణ కన్స్ట్రక్షన్స్ (Aparna Constructions): 4.5% వాటాతో 20.23 మిలియన్ చదరపు అడుగుల సరఫరాను సిద్ధం చేస్తోంది. దీని మార్కెట్ విలువ సుమారు రూ. 28,050 కోట్లు.
- వాసవి గ్రూప్ (Vasavi Group): 19.70 మిలియన్ చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణం మరియు రూ. 21,200 కోట్ల విలువతో టాప్-5లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది.
- ప్రెస్టీజ్ గ్రూప్ (Prestige Group): 13.75 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంతో రూ. 18,713 కోట్ల విలువైన ప్రాజెక్టులను మార్కెట్లోకి తెస్తోంది.
- రాఘవ (Raghava): 8.61 మిలియన్ చ.అడుగులు (రూ. 13,669 కోట్లు)
- కాండూర్ డెవలపర్స్ (Candeur Developers): 8.69 మిలియన్ చ.అడుగులు (రూ. 11,358 కోట్లు)
- హోనర్ హోమ్స్ (Honer Homes): 5.87 మిలియన్ చ.అడుగులు (రూ. 9,574 కోట్లు)
- సైబర్ సిటీ బిల్డర్స్ (Cybercity Builders): 6.03 మిలియన్ చ.అడుగులు (రూ. 9,182 కోట్లు)
- శాస్ ఇన్ఫ్రా (SAS Infra): 6.35 మిలియన్ చ.అడుగులు (రూ. 9,046 కోట్లు)
- మొత్తం మీద చూస్తే, ఈ పది మంది డెవలపర్లు కలిసి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నివాస కేంద్రంగా మారుస్తున్నారు. రాబోయే ఐదేళ్లలో నాణ్యమైన గృహాల సరఫరా పెరగడమే కాకుండా, నగర ఆర్థిక వ్యవస్థకు రియల్ ఎస్టేట్ రంగం వెన్నెముకలా నిలవబోతోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.





# మైసా కోసం కసరత్తులు

'పుష్ప' ఫ్రాంఛైజీ, 'యానిమల్' 'ఛావా' చిత్రాలతో జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతుల్ని సంపాదించుకుంది అగ్ర నాయిక రష్మిక మందన్న. తాజాగా ఆమె 'మైసా' చిత్రంతో కెరీర్‌లోనే ఓ ఛాలెంజింగ్ రోల్‌ని పోషిస్తున్నది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో గిరిజన తెగకు చెందిన గోండ్ మహిళగా కనిపించనుంది రష్మిక మందన్న. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. ఈ సినిమాలోని యాక్షన్ ఘట్టాల కోసం రష్మిక మందన్న ప్రతిరోజూ 8 గంటల కఠోర శిక్షణ తీసుకుంటున్నది. అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండిలాంగ్ పర్యవేక్షణలో బ్యాంకాక్‌లో ఈ ట్రెయినింగ్ జరుగుతున్నది. 'మైసా' కథ విన్న తర్వాత పాత్ర కోసం తాను శారీరకంగా, మానసికంగా మరింత దృఢంగా కనిపించాలని రష్మిక నిర్ణయించుకుందని, యాక్షన్ ఘట్టాలన్నీ సహజంగా కనిపించాలనే లక్ష్యంతో బ్యాంకాక్‌లో స్టంట్స్, కంబాట్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదని మేకర్స్ తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. త్వరలో కేరళలో 16రోజుల పాటు జరిగే కీలక యాక్షన్ షెడ్యూల్ కోసం రష్మిక మందన్న ఈ శిక్షణ తీసుకుంటున్నది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాతలు: అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచనదర్శకత్వం: రవీంద్ర పుల్లె.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.